# మరణ భీతి

## సుంకరి రాంప్రసాద్

విజయనగరం అయోధ్యా మైదానం విద్యుద్దీప కాంతు లతో వెలిగిపోతూంది.

ప్రముఖ యువ ఛాయాగ్రాహకుడు రాజేంద్ర యొక్క 'ఫోటో ఎగ్జిబిషన్' ఆ మైదానంలో యేర్పాటు చేయ బడింది. జిల్లా కలెక్టర్ శ్రీపతిరావు రిబ్బను కత్తిరించి ఎగ్జిబిషన్ ప్రారంభించాడు.

ఎగ్జిబిషన్ నిజంగా అద్భుతంగా వుంది. అపురూప మైన పక్షులు, జంతువుల ఫోటోలతోపాటు, మనోజ్ఞ మైన ప్రకృతి దృశ్యాలు దర్శకుల కనువిందును చేస్తున్నాయి.

ముఖ్యంగా ఒక్కొక్క ఫీచర్ క్రింద ఆ భావాన్ని స్ఫురింపజేసే చిత్రాల అమరిక మరింత హృద్యంగా వుంది.

'ప్రసవ వేదన' అని వ్రాయబడ్డ కాప్షన్ క్రింద 'ఖడ్గమృగం' ప్రసవిస్తున్న దృశ్యం..ముఖ్యంగా అందులో

ఖడ్గమృగం ముఖంలో కన్పిస్తున్న బాధ.... చూపరులను విచలితులను చేస్తూంది.

అలాగే 'మాతృ ప్రేమ' అని వ్రాయబడ్డ కాప్షన్ క్రింద తన పిల్లల చిన్నారి ముక్కులకు ప్రేమతో ఆహారాన్ని అందిస్తున్న పక్షి చిత్రం, ఒక వానరం తన పిల్లను గుండెలకు హత్తుకొని స్తన్యం యిస్తున్న దృశ్యం. ఇలాగే ఎన్నో అద్భుతమైన చిత్రాలు...

పిల్లలను, సామాన్య ప్రజలను ఈ చిత్రాలు ఆకర్షిస్తుంటే చదువుకున్నవారిని, ముఖ్యంగా ఫోటోగ్రఫీ పట్ల అభిరుచి ఉన్నవారిని ఆకర్షిస్తున్నది ఇంకో ప్రత్యేక చిత్రాల ప్రదర్శన.

అది 'మరణ భీతి' అన్న ఫీచర్ క్రింద అమర్చబడ్డ చిత్రాలు.

మరణం ఆసన్నమయిందని తెలిసిన క్షణాల్లో.... వివిధ రకాల స్త్రీ పురుషుల ముఖాలలో, కన్నులలో ప్రతిఫలించే భయం.... భీతి మొదలగు భావాలను సజీవంగా చూపిస్తున్న చిత్రాలవి.

వాటిని ఎలా సేకరించాడో గాని.... నిజంగా 'హేట్స్ ఆఫ్ టు రాజేంద్ర' అనుకున్నారు ఆ ప్రదర్శన చూసిన ప్రతి ఒక్కరూ.

మొదట కేవలం మూడు రోజుల పాటు నిర్వహిద్దామనుకున్న ఆ ఫోటో ఎగ్జిబిషన్ను పురప్రజల కోరిక మీదట మరో రెండురోజుల పాటు పొడిగించడానికి అంగీకరించాడు రాజేంద్ర.

అయితే.... పొడిగించబడ్డ ఆ రెండు రోజులలో ఆ ఎగ్జిబిషన్ చూడడానికి ఒక వ్యక్తి రావడంతో

రాజేంద్ర కొన్ని అనూహ్యమైన సంఘటనలను యెదుర్కొనవలసి వచ్చింది. అలాంటి పరిస్థితి వస్తుందని ఏమాత్రం ముందుగా ఊహించినా రాజేంద్ర తన ఫోటో ఎగ్జిబిషన్‌ను పొడిగించడానికి అంగీకరించేవాడు కాదు.

ఆ వ్యక్తి రాంకుమార్....సి.బి.ఐ. ఆఫీసర్.

విశాఖపట్టణంలోని 'యోగాశ్రమం' నడుపుతున్న దొంగ బాబాను పట్టించాక, ఆ కేసును పూర్తి వివరాలతో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు అప్పగించి, ఢిల్లీకి ప్రయాణం కాబోతూ....తన కాలేజ్ మేట్ గోవిందరావు ఆహ్వానించడంతో విజయనగరం వచ్చాడు రాంకుమార్.

రాంకుమార్, గోవిందరావు విజయనగరం మహారాజా కాలేజ్‌లో బి కాం చదువుతూండగా స్నేహితులయ్యారు. మూడు సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా సాగిపోయింది వారి స్నేహయాత్ర. ఇద్దరి అభిప్రాయాలూ, అభిరుచులూ ఒక్కటే కావడంతో ప్రాణస్నేహితులయ్యారు వారు.

ఇద్దరకూ మొదటినుండీ 'నేర పరిశోధన' అంటే ఓ ప్రత్యేకమయిన యిష్టం ఉండటంచేత, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఎగ్జామ్స్‌కు వెళ్ళటం, సెలక్ట్ అయ్యాక పోలీస్ శాఖలో ప్రవేశించడం జరిగింది.

తరువాత రాంకుమార్ సి.బి.ఐ. ఆఫీసర్ అయి, ఢిల్లీ వెళ్ళిపోయాడు గోవిందరావుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విజయనగరంలోనే పోస్టింగ్ రావటం, పెళ్ళిచేసుకొని విజయనగరంలోనే ఫ్యామిలీని పెట్టడం జరిగింది.

స్నేహితుని పెళ్ళికి రాలేకపోయాడు రాంకుమార్. అందుకే అత్యవసరంగా ఢిల్లీ వెళ్ళాల్సి వున్నా, స్నేహి

తుని మాటను కాదనలేక విజయనగరం వచ్చాడు.

ఆ రోజు సాయంత్రం స్నేహితులిద్దరూ 'రాజేంద్ర' ఫోటో ఎగ్జిబిషన్‌కు వెళ్ళారు. గోవిందరావు అంతకు ముందే ఒకసారి ఆ ఎగ్జిబిషన్‌ను చూసినా, స్నేహితుని కోసం మరోసారి వచ్చాడు.

అద్భుతమూ, అపురూపమూ అయిన ఆ చిత్ర ప్రపంచంలోనికి అడుగుపెట్టాక తమను తాము మరచిపోయారు ఆ స్నేహితులిద్దరూ.

'ప్రకృతిలోని అందాలను, పశు పక్ష్యాదుల మూగ జీవితపుటానందాన్ని తన చిన్న కెమెరాలో బంధించి... యిక్కడ ... ఆ చిన్న రంగుల దేరాలో ప్రదర్శిస్తున్నాడా ఈ యువ ఛాయాగ్రాహకుడు'....అని అనిపించింది రాంకుమార్‌కు.

తను వెంటే వస్తూ అన్నీ విపులీకరిస్తున్న రాజేంద్ర భుజాన్ని ప్రశంసాపూర్వకంగా తట్టాడు రాంకుమార్.

ఎగ్జిబిషన్‌లోని చివరి బ్లాక్‌లోనికి ప్రవేశించారు వారు. అక్కడ వున్నవి 'మరణ భీతి' చిత్రాలు.

ఆ చిత్రాలను చూస్తుంటే ఫోటోగ్రాఫర్‌గా రాజేంద్ర యెంతో యెదిగిపోయినట్లు అనిపిస్తూంది. ఒక్కొక్క చిత్రాన్ని చూస్తూ ముందుకు నడుస్తున్నారు వారు.

నడుస్తున్న రాంకుమార్ టక్కున బ్రేక్ వేసినట్లు ఆగిపోయాడు. అతని చూపులన్నీ ఒక పెద్ద ఫోటోపైన కేంద్రీకరింపబడి వున్నాయి.

అది 12 × 24 అంగుళాల సైజులో వున్న ఫోటో. అయితే అంత పెద్ద ఫోటోలోనూ కన్పిస్తున్నవి కేవలం రెండు కళ్ళు మాత్రమే. భయంతో బాగా విప్పార్చ

కొని ఉన్నట్లు వున్నాయి ఆ కళ్ళు.

"బ్యూటిఫుల్ ఐస్....అండ్ ఎ మార్వలెస్ ఎక్స్ ప్రెషన్ మిస్టర్ రాజేంద్రా! యెవరిదీ ఫోటో....!" రాజేంద్రవైపు చూస్తూ అడిగాడు రాంకుమార్.

"అది....అది....సరిగ్గా గుర్తులేదు సర్"—మెల్లగా గొణుగుతున్నట్లు చెప్పాడు రాజేంద్ర.

ఎంత అణచుకున్నా దాగని కలవరపాటు రాజేంద్ర కళ్ళల్లో కదలాడింది. అదీ కేవలం ఒక్క క్షణం. అంతే!

అయితే ఆ కలవరపాటు రాంకుమార్ పోలీస్ కళ్ళను మాత్రం తప్పించుకు పోలేకపోయింది. రాంకుమార్ రాజేంద్రను పాలోచనగా చూశాడు.

ఇప్పుడు రాంకుమార్ ఆలోచిస్తున్నది రాజేంద్ర ఎందుకు ఉలిక్కిపడ్డాడని కాదు. అలాంటి కళ్ళనే తను యెక్కడో చూశాడు. యెక్కడ....? యెక్కడయి వుంటుంది....? యెంత ప్రయత్నించినా అది గుర్తుకు రావటంలేదు.

అలా ఆలోచిస్తూ అయిదారు అడుగులు వేశాక.... గిరుక్కున వెనుతిరిగి వచ్చి మరలా ఆ ఫోటో వంకే తదేకంగా చూడసాగాడు రాంకుమార్.

అతని మస్తిష్కంలో ఏదో రూపం అస్పష్టంగా కదులుతూంది.

"మిస్టర్ రాజేంద్రా..! ఈ ఫోటో ఎప్పుడు, ఎక్కడ తీశారో చెప్పగలరా?"

రాజేంద్ర విసుగ్గా చూశాడు. 'ప్రజారంజకమైన కళనుకూడా మీ పోలీసులు నేర దృష్టితోనే చూస్తారు సుమా!' అన్నట్లుంది అతని చూపు. అతని ముఖం మాత్రం యే భావమూ లేకుండా నిర్లిప్తంగా వుంది.

"సారీ.... సర్! చెప్పలేను. ఐ మాస్ట్ సరులేదు. నేను ఈ ఫోటో ఎగ్జిబిషన్ పెట్టడంకోసం కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నాను. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి.... ఎన్నో ప్రదేశాలు తిరిగి.... రకరకాల ఫోటోలను తీసి భద్రపరుస్తున్నాను. వాటిలో ఈ ఫోటో యెప్పుడు, ఎక్కడ తీశానో గుర్తుంచుకొని చెప్పడమంటే నో.... ఇటీజ్ ఇంపాజిబుల్" రాజేంద్ర గొంతు దృఢంగా పలికింది.

ఆ ఫోటో గురించి యే విషయమైనా చెప్పడానికి రాజేంద్ర సుముఖంగా లేడని రాంకుమార్‌కు అర్థమయింది. ఎందుకు? ఆ ఫోటోలో ఏమైనా మిస్టరీ వుందా? ఆ ఫోటో గురించి అడిగేసరికి రాజేంద్ర యెందుకు కలవరపడ్డాడు?

అన్నీ ప్రశ్నలే!... జవాబులు దొరకని ప్రశ్నలు.

రాంకుమార్ సిక్స్‌సెన్స్.... ఇందులో యేదో మెలిక వుందని చెబుతూంది. అంతూ పొంతూలేని ఆలోచనలతోనే ఎగ్జిబిషన్ బైటకు నడిచాడు రాంకుమార్.

## 2

ఆ రోజు రాత్రి 'సప్పర్' తీసుకున్నాక లాన్‌లో వేయబడ్డ కుర్చీలలో కూర్చున్నారు మిత్రులిద్దరూ. వారి ఎదురుగా వున్న వెండిపళ్ళెంలో తమలపాకులు, సున్నం, వగైరా తాంబూల సామాగ్రి వుంది.

రెండు వక్కలు, ఏలక్కాయ నోటిలో వేసుకొన్నాడు రాంకుమార్. గోవిందరావు తమలపాకులకు ఈనెలు తీసి సున్నం రాసుకోసాగాడు.

"గోవిందా.... నాకు రాజేంద్ర గురించి కొన్ని వివరాలు కావాలి. అదీ రేపటిలోగా—" నెమ్మదిగా

అన్నాడు రాంకుమార్.

"ఇంతకు క్రితమే అడుగుదామనుకున్నాను. అసలు నీ సందేహం యేమిటి? వాట్ ఆర్ యూ సస్పెక్టింగ్?" చిన్నగా నవ్వుతూ అడిగాడు గోవిందరావు.

"ఆ ఫోటో నువ్వుకూడా చూశావు కదా. అదే 'మరణ భీతి' ఆ జంట కన్నుల ఫోటో" గోవిందరావు వైపే సాలోచనగా చూస్తూ అన్నాడు రాంకుమార్.

'చూశాను' అన్నట్లు తలూపాడు గోవిందరావు.

"నీకేం అనిపించింది?" అడిగాడు రాంకుమార్.

రాంకుమార్ వంక ప్రశ్నార్ధకంగా చూశాడు గోవిందరావు.

రాంకుమార్ చిన్నగా నవ్వి, చెప్పసాగాడు.

"గోవిందా! ఆ ఫోటో చూసిన క్షణంలో ఎందుకో అది రియల్ ఎక్స్‌ప్రెషన్ అనిపించింది. ఏమిటో చని పోతున్న మనిషి కళ్లలో కనిపించే భయం. 'మరణ భీతి'. హౌ దిస్ ఫోటోగ్రాఫర్ కుడ్ గెట్ దట్ కేర్ ఎక్స్‌ప్రెషన్....మరణం ఆసన్నమయిన క్షణంలో బహుశా ఆ ఫోటో తీయబడి వుండాలి. ఆ కళ్ళలోని భయం, విప్పార్చుకొని ఉన్న ఆ కనుగ్రుడ్లను చూస్తుంటే ఎందుకో అది సహజ మరణం కాదు అనిపిస్తుంది నాకు.

అది హత్య కానీ, ఆత్మహత్య కానీ, సహజమరణం కానీ, ఆ సమయంలో రాజేంద్ర అక్కడ యెందుకు వున్నాడు? ఒకవేళ ఉండివుంటే.... ఒక మనిషి మరణాన్ని అంత సులువుగా మరచిపోయాడా?

నెవ్వర్....! అంటే .... అతడు ఆ విషయం....ఆ ఫోటో వివరాలు చెప్పడానికి యిష్టపడటంలేదు. అదే... ఎందుకు....?"

రాంకుమార్ లాజిక్‌కు నిజంగా మతిపోయింది గోవిందరావుకు. 'ఎంతయినా సి. బి. ఐ. బుర్ర' అనుకున్నాడు.

"ఆ ఫోటో వెనుక ఒక మరణం వుంది. ఆ మరణం సంభవించిన క్షణంలో రాజేంద్ర అక్కడే వున్నాడు. ఇది నిర్వివాదాంశం. దెన్ వై ఈజ్ హి హైడింగ్ దట్ ట్రూత్....? అది తేలాలంటే రాజేంద్ర గత చరిత్ర తెలుసుకోవాలి."

తను చెప్పాల్సింది పూర్తయినట్లు పేముకుర్చీలో రిలాక్సింగ్‌గా వెనక్కు వాలాడు రాంకుమార్.

## 3

మరునాడు ఉదయం పదిగంటలకల్లా రాంకుమార్ చేతికి ఒక ఫైల్ అందించాడు గోవిందరావు. అది రాజేంద్ర గురించి పూర్తి వివరాలున్న ఫైలు.

'గుడ్ వర్క్' అన్నట్లు చిన్నగా నవ్వుతూ చూశాడు రాంకుమార్.

అయితే రాంకుమార్ ఆశించినట్లు ఆ ఫైలులో రాజేంద్రను అనుమానించదగ్గ విషయాలేమీ లేవు. రాజేంద్ర కెక్కువగా స్నేహితులుకూడా లేరు. ఎంత సేపూ తనూ, తన ఫోటోగ్రఫీ. అంతే!

ఇతరుల విషయాలలో జోక్యం కూడా చేసుకోనివాడు కాదని, యింటి బాడుగ మాత్రం సరిగ్గా నెల పూర్తయ్యేసరికి చెల్లించేవాడని.... రాజేంద్ర అద్దెకుంటున్న యింటి యజమాని రిపోర్టు. అతని కాలేజ్ లైఫ్ కూడా యే రిమార్క్స్ లేకుండా వుంది.

రాజేంద్రకి నా అనేవారు ఎవరూ లేరు. హాస్టల్‌లో వుండి చదువుకొనేవాడు. అతని తల్లిదండ్రుల గురించి

వివరాలు తెలియవు.

అంతవరకూ చదివి విసుగ్గా ఫైలు మూసేయబోతున్న క్షణంలో రాంకుమార్‌ను ఆకర్షించింది ఒక వాక్యం.

అది....రాజేంద్ర గురించి ఫైలులో వ్రాయబడ్డ ఆఖరి వాక్యం.

'ఈ మధ్యకాలంలో రాజేంద్ర తరచుగా విశాఖ పట్టణం వెళ్ళుతున్నాడట. ఒక్కొక్కసారి రెండు, మూడు రోజులు 'విశాఖ లోనే వుంటున్నాడట.'

చాలా సాధారణ విషయమిది. కాని ఎందుకో రాంకుమార్‌ని ఈ చిన్న వాక్యం ఆకర్షించింది.

ఫైలును గోవిందరావు కందజేస్తూ.... రేపటి తమ కార్యక్రమాన్ని చెప్పాడు రాంకుమార్.

'హాయిగా గడుపుదామనుకున్న ఈ రెండు రోజులూ ....ఎందుకొచ్చిన లేనిపోని తంటా' అనుకున్నాడు గోవిందరావు.

కాని రాంకుమార్ స్వభావం తెలుసు కాబట్టి మౌనంగా ఊరుకొన్నాడు. రాంకుమార్ కనుమానం రాదు. వచ్చిందంటే దాని అంతు చూడందే వదలి పెట్టడు.

'తను గడ్డివాములో సూదిని వెతుకుతున్నానని' రాంకుమార్‌కు తెలుసు. కాని మరో మార్గం లేదు.

రాజేంద్ర తీసిన ఆ ఫోటో....ఎవరిదో తెలుసుకోవాలంటే అదొక్కటే మార్గం అనిపించింది అతనికి. సహాజ మరణం చెందిన వ్యక్తియొక్క కళ్ళలా లేవు అవి. ఆ వ్యక్తి హత్య కావింపబడినా, ఆత్మహత్య చేసుకున్నా అది పోలీసుల రికార్డుల్లో ఎక్కి వుంటుంది.

గోవిందరావు తన పోలీసు అధికారి హోదా వినియో

గించి ఆ ఫోటోయొక్క రెండు కాపీలు సంపాదించాడు. ఒక కాపీ గోవిందరావు దగ్గరే వుంచి, మిగిలినది తను తీసుకున్నాడు రాంకుమార్.

ఇప్పుడు చేయవల్సిన పని: గత సంవత్సర కాలంలో పోలీసుల రికార్డులలో నమోదయిన హతులఫోటోలు పరిశీలించడం. ముఖ్యంగా స్త్రీలవి. ఎందుకంటే ఎక్స్‌పర్టు ఫోటోగ్రాపర్ యిచ్చిన రిపోర్టు ప్రకారం ఆ కళ్ళు.... స్త్రీవి. అందులో ఇరవై ఐదు సంవత్సరాల లోపు యువతివి అనడానికి చాలా అవకాశా లున్నాయి.

ఆ హతుల ఫోటోలలోని కళ్ళకు, తన దగ్గరున్న కళ్ళకు యేమయినా పోలిక లున్నాయేమో పరిశీలించడం. అఫ్ కోర్స్ యిదంతా ఎక్స్‌పర్టు ఫోటోగ్రాఫర్ చేయాల్సిన పని.

విజయనగరంలో ఆ ఫోటోల వర్క్‌ను గోవిందరావుకు అప్పగించి, తను విశాఖపట్టణం బయలుదేరాడు రాంకుమార్.

ఒకవేళ ఆ యువతి సహజమరణం చెందివుండినట్లయితే, ఆ మరణం పోలీసుల రికార్డులలో లేకుండినట్లయితే తన శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరే అని రాంకుమార్‌కు తెలుసు.

కాని....యీ మార్గంలో తనకు యేదో ఒక 'క్లూ' దొరకక పోదని రాంకుమార్ సిక్త్స సెన్స చెబుతూంది....

## 4

విశాఖపట్టణం చేరి అప్పటికి ఇరవై నాలుగు గంట లయింది. 'సీ పెరల్' హోటల్‌లోని తన రూమ్‌లో.... కుర్చీని దీర్ఘాలోచనలో మునిగి వున్నాడు రాంకుమార్.

ఒక గంట క్రితమే విజయనగరం నుండి గోవిందరావు మెసేజ్ పంపాడు. విజయనగరం పోలీస్ రికార్డులలో ఆ ఫోటోను పోలినవారెవరూ లేరట. అరగంట క్రితమే విశాఖపట్టణం వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల నుండి కూడా మెసేజ్‌లు వచ్చాయి—అదే నెగిటివ్ ఆన్సర్.

ఇక—ఒక్క త్రీటౌన్ పోలీస్ స్టేషన్ నుండి మాత్రం మెసేజ్ రావల్సి వుంది. అక్కడ నుండి కూడా నెగిటివ్ ఆన్సర్ వచ్చిందంటే....కథ మళ్ళీ మొదటికి వచ్చినట్లే.

'తను అనవసరంగా అనుమానిస్తున్నానా' అని అనిపించింది ఒక్కక్షణం. కాని రాజేంద్ర, కళ్ళలోని కలవరం గుర్తుకువచ్చాక మళ్ళీ ఏదో ఆశ కలిగింది రాంకుమార్‌కు.

ఇంతలో, అతని ఆలోచనలను భంగపరుస్తూ టేబిల్ పైన వున్న టెలిఫోన్ మ్రోగసాగింది. రిసీవర్ అందుకొన్నాడు రాంకుమార్. అది త్రీటౌన్ పోలీస్ స్టేషన్ నుండి వచ్చిన కాల్. త్రీటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతున్నాడు.

"సర్....ఒక ఫోటోలో కాస్త పోలికలు కన్పించాయి. ఆమె...."

అతని మాటలను మధ్యలోనే కట్ చేశాడు రాంకుమార్.

"నేను బయలుదేరి వస్తున్నాను. మన ఫోటోగ్రాఫర్‌ను అక్కడే ఉండమనండి"—అని చెప్పి రిసీవర్ క్రెడిల్ మీద ఉంచాడు.

'నేరపరిశోధనలో నేరస్తుల గురించిన ఏ వివరాలూ

టెలిఫోనులో మాట్లాడకూడదు' అన్నది తన ట్రెయినింగ్ లో నేర్చుకున్న ఒక పాఠం. ఆ ఇన్ఫర్ మేషన్ ను ఎవరయినా ట్రాప్ చేసి ముద్దాయికి అందించినా, అతడు దానికి ప్రత్యామ్నాయం వెతుక్కొని సిద్ధంగా వుంటాడు. సులువుగా తప్పించుకోగలుగుతాడు.

ఐదు నిముషాల తర్వాత హోటల్ 'సీ పెరల్' నుండి ఒక టాక్సీ బయటకు దూసుకుపోయింది. అందులోని వెనుక సీటులో రిలాక్స్ డ్ గా కూర్చుని వున్నాడు రాం కుమార్.

## 5

విశాఖ త్రీటౌన్ పోలీస్ స్టేషన్.

సబ్ ఇన్ స్పెక్టర్ అందించిన ఫైలును చూస్తున్నాడు రాంకుమార్. అతని యెదురుగా త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్ స్పెక్టర్ రమేష్, పోలీస్ ఎక్స్ పర్ట్ ఫోటోగ్రాఫర్ సన్యాసిరావు కూర్చుని వున్నారు.

ఈ మధ్యే ఆ కేసు క్లోజ్ చేయబడింది. హంతకుడు కూడా అరెస్టు చేయబడ్డాడు. ఇప్పుడు మళ్ళీ ఆ క్లోజ్ చేయబడ్డ కేసును సి.బి.ఐ. ఆఫీసరు రాంకుమార్ తిరగతోడుతున్నందుకు వారికి విసుగ్గా వుంది. కాని, ఆ భావం యేమాత్రం కూడా తమ ముఖాల్లో కన్పించకుండా జాగ్రత్తపడ్డారు వారు.

ఫైలులోని హతురాలి ఫోటోలను చూసిన మరుక్షణం రాంకుమార్ కు ఆ 'జంటకన్నుల' ఫోటోను చూసినప్పుడు అలాంటి కళ్ళనే తను ఎక్కడో చూశానని తనకు ఎందుకనిపించిందో అర్థమయింది. మరణించిన ఆమె శవాన్ని వివిధ కోణాల్లోంచి తీయబడ్డ ఫోటోలన్నీ ఆ ఫైలులో పొందికగా అంటించబడి వున్నాయి. అయితే రాంకుమార్

చూస్తున్నది ఆ ఫోటోలను కాదు.

మరణించక ముందు తీయబడ్డ హతురాలి 'బస్ట్ ఫోటో'ను. ఆమె హత్య చేయబడినప్పుడు ఆ ఫోటోనే పేపర్ లో వేశారు. చిలిపిగా నవ్వుతున్న ఆ కళ్ళను చూసే తను 'బ్యూటిఫుల్ ఐస్' అనుకున్నాడు.

"మిస్టర్ ...." ఎదురుగా కూర్చుని వున్న ఎక్స్పర్టు ఫోటోగ్రాఫర్ ను ఎడ్రస్ చేశాడు రాంకుమార్.

"సన్యాసిరావు.... సర్" ఫోటోగ్రాఫర్ గొంతులో నమ్రత.

తన చేతిలోని ఫైలును మూసి సుతారంగా బల్ల మీదకు గిరవాటు వేస్తూ అడిగాడు రాంకుమార్.

"నేను యిచ్చిన ఫోటోలోని కన్నులు ఈమెవే అని మీరు యెలా చెప్పగలరు?"

"సర్! ఏ వ్యక్తి కన్నులూ మరొకరివి పోలివుండవు. కనుబొమ్మల తీరు, కంటిపాప రంగు, ఐరిస్ రెటీనా.... ముఖ్యంగా కంటి గ్రుడ్డు ఆకారం. ఇంకా కంటిరెప్పలు, వాటిమీద వుండే వెంట్రుకలూ యివన్నీ ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధంగా వుంటాయి" సిన్సియర్ గా ఎక్స్ ప్లెయిన్ చేయసాగాడు సన్యాసిరావు.

"అఫ్ కోర్స్" అవన్నీ మీలాంటి ఎక్స్పర్ట్స్ కనిపెట్ట గలరనుకోండి. కాని యింకేదో ప్రత్యేకత ఉందనిపిస్తోంది ఈ కళ్లలో. ఐరిస్ ఒక్కసారి చూస్తే చాలు. మా లాంటివారు కూడా గుర్తుంచుకోదగ్గ ప్రత్యేకత. యేమి టది....?" సన్యాసిరావు మాటలను మధ్యలో కట్ చేస్తూ అడిగాడు రాంకుమార్.

రాంకుమార్ ప్రశ్నకు వెంటనే జవాబివ్వలేదు సన్యాసిరావు. టేబిల్ మీద ఫైలును చేతిలోకి తీసు

కున్నాడు. ఫైలును తెరచి ఆ ఫోటోలవంకే దీక్షగా చూడసాగాడు.

"మీరన్నట్లు ఈ కళ్ళలో నిజంగా ఓ ప్రత్యేకత ఉంది సర్" అన్నాడు.

రాంకుమార్ కుతూహలంగా చూశాడు.

"ఈ కళ్ళల్లో ఒక మత్తువుంది. అంటే 'సెక్సీ ఐస్' అన్నమాట. మగవాళ్ళను సమ్మోహితులను చేసే కళ్ళు" చెప్పాడు.

"మిస్టర్ రమేష్! మనం ఒకసారి హతురాలి ఇంటికి వెళ్దామా?" కుర్చీలోంచి లేస్తూ అన్నాడు రాంకుమార్. అతని చేతిలో ఆ కేసు ఫైలుంది.

'ఎందుకొచ్చిన తద్దినం?' అని మనసులో అనుకొంటూ అతడిని అనుసరించాడు సబ్ యిన్స్పెక్టర్ రమేష్.

స్టేషన్ ఆవరణలో జీపు సిద్ధంగా ఉంది. వారిద్దరు యెక్కి కూర్చోగానే జీపును స్టార్ట్ చేశాడు డ్రైవర్.

"పెద వాల్తేర్ పోనీ" అన్నాడు రమేష్. అతని గొంతులో యెంత దాచుకున్నా దాగని విసుగు లీలగా ధ్వనించింది.

అతనివంక నవ్వుతూ చూశాడు రాంకుమార్. అతడి చూపులకు యిబ్బందిగా కదులుతూ దిక్కులు చూడసాగాడు రమేష్.

అతని పరిస్థితిని గమనించి తన దృష్టిని మరల్చాడు రాంకుమార్. ఇప్పుడు అతనికళ్ళు అర మోడ్చి వున్నాయి. అయితే అర మోడ్చిన ఆ కన్నుల వెనుక యింతకు క్రితం చదివిన ఆ హత్యకేసు సినిమారీల్లలా తిరగసాగింది. ఆ కేసును మననం చేసుకొంటున్నాడు రాంకుమార్.

హాతురాలి పేరు జయమాల. ఆమె భర్త సత్యం మునిసిపల్ ఆఫీసులో అటెండరుగా పని చేస్తున్నాడు.

జయమాల స్వతహాగా చాలా అందమయినది. దానికి తోడు ఆడది యెలా అలంకరించుకొంటే మరింత ఆకర్షణీయంగా కన్పిస్తుందో జయమాలకు బాగా తెలుసు. అద్దంలో తన అందాన్ని చూస్తూ గడపడమంటే ఆమెకు యెంతో యిష్టం. తన అందాన్ని పొగిడే మగవారంటే మరీ యిష్టం.

జయమాల తండ్రి ఒక స్కూల్ మాస్టరు. జయమాల పుట్టిన తరువాత చాలా సంవత్సరాల వరకూ అతడికి సంతానం కలగలేదు. సుమారు పది సంవత్సరాల తరువాత అంటే నడిమి వయస్సులో ఒక మగపిల్లవాడ్ని కని జయమాల తల్లి మరణించింది. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్నాడు ఆ అబ్బాయి. ఉదయం పది గంటలకు తండ్రీ, తమ్ముడూ యిల్లు వదిలితే మరలా తిరిగివచ్చేది చీకటి పడ్డాకే.

ఉదయం పది గంటలకల్లా వంట పూర్తి చేసి వారికి క్యారేజ్‌లు కట్టేసి యిచ్చేస్తే ...మరలా సాయంత్రం వరకూ బోలు తీరిక. పెరుగుతున్న వయసు, వయసుతో పాటు శరీరం తీర్చిదిద్దుకొంటున్న వంపులు. అపైన ఒంటరితనం....యివన్నీ ఒక ఎత్తు....వీధిలోని వర్రకారు ఆకలి చూపులను భరించడం యింకో యెత్తు అయ్యేది జయమాలకు.

జయమాల తండ్రి జాగ్రత్తపరుడు. తన జీతంలో సగానికి పైగా తన కూతురి పెళ్ళికోసం డబ్బు బాంక్‌లో వేసేవాడు. ఆర్థికపరంగా అంత జాగ్రత్త తీసుకొన్న అతడు తన కూతురుపట్ల తీసుకోవాల్సిన యింకో ముఖ్య

మైన జాగ్రత్త తను మరిచాడు. అది....వయసులో వున్న ఒక అందమయిన ఆడపిల్లను ఎవరి తోడూ లేకుండా యింటిదగ్గర ఒంటరిగా వదలకూడదన్నది.

తండ్రి మితిమీరిన పొదుపుదనంవల్ల, మిగిలిన ఆడపిల్లల్లా కాకుండా చాలా సాధారణ జీవితం గడపాల్సి వచ్చింది జయమాలకు. చాలా చిన్న కోరికలు....స్నో, పౌడర్, గోళ్ళ రంగు, పెదాల రంగు లాంటి కాస్మెటిక్స్ కోసం కూడా వయసులో వున్న ఆడపిల్ల కలలు గనాల్సిన పరిస్థితి. సీతాకోకచిలుకల్లా సింగారించుకొని వీధిలోంచి వెళ్తున్న తనతోటి ఆడపిల్లల వంక తెరచిన కిటికీ రెక్క చాటునుండి ఆబగా చూసేది జయమాల.

సరిగ్గా ఆమె యొక్క ఆ బలహీనతపైనే దెబ్బ కొట్టాడు ఆ వీధిలోని లాయర్ గారబ్బాయి మోహన్.

మోహన్ ప్రెజెంట్ చేసిన ఫారిన్ సెంట్స్, స్నో, పౌడర్ టిన్స్ అతని మాటల్లోని చలాకీతనం .... దూసుకుపోయే అతని మనస్తత్వం....జయమాలలో ఒక వివశత్వాన్ని కలిగించాయి. ఆపైన వారికి కావల్సినంత ఏకాంతం.

అప్టరాల్ జయమాల ఈ దేశంలో ఒక సగటు ఆడపిల్ల. అలాంటివారిని వలలో వేసుకోవడం, తన కోరికలు తీర్చుకోవడం మోహన్‌లాంటి వాళ్ళకు చాలా సులభం.

జయమాల తండ్రి చెవికి ఈ వార్త చేరేసరికి పరిస్థితి అతడి చేయి జారింది. ఆమె కాలు జారింది. అయితే అతడు స్కూల్లో పాఠాలను నేర్పడమే కాదు, జీవిత పాఠాలను తానుకూడా నేర్చుకున్న మనిషి.

అందుకే గంతకు తగ్గ బొంతను చూసి తన కూతురుకు గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళి చేసేశాడు. అత్తవారింట

అడుగు పెట్టిన మరుక్షణం తన పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చిందని గ్రహించింది జయమాల. తన అతిచిన్న కోరికలను సైతం తీర్చలేని చిన్న ఉద్యోగి తన భర్త. ఈ ప్రపంచంలో ఆమె అతి ఎక్కువ విలువ నిచ్చేది తన అందానికి....తన సౌందర్య పోషణకు.

మనిషి రక్తం చవిచూడనంతవరకూ పెద్దపులి కూడా మనుషులంటే భయపడుతుందట. కాని, ఒక్కసారి నర మాంసాన్ని రుచి చూశాక అది ఇతర జీవాలను ముట్టదు. దానికి ఎక్కడలేని తెగింపూ వస్తుంది. జయమాలలాంటి తెలివైన ఆడవారూ అంతే! 'తప్పు ఒకసారి చేసినా ఒకటే, పదిసార్లు చేసినా ఒకటే' అనుకొంది జయమాల.

అంతే!!—ఆమెకు ఎక్కడలేని తెగింపూ వచ్చేసింది. ఆమె అదృష్టం....అత్తవారింట్లో కూడా ఆమెకు ఒంటరితనం కలిసివచ్చింది. భర్త సత్యం ఉదయం తొమ్మిదికల్లా ఆఫీసుకు వెళ్తే మరలా తిరిగివచ్చేది చీకటిపడ్డాకే. ఆ మాత్రం ఏకాంతం చాలదూ....జయమాలలాంటి ఆడవారికి ఆ వీధిలోని కుర్రకారును ఒక ఊపు ఊపేందుకు.

జయమాలకు ఒక్క విషయం తృప్తిగా వుంది. ఒకప్పుడు ఈ కుర్రకారు తనను ఆటపట్టించేవారు. ఇప్పుడు తను వాళ్ళను ఆటాడిస్తుంది. అయితే తన విచ్చలవిడితనానికి తను చాలా పెద్ద ప్రతిఫలాన్ని చెల్లించబోతూందని జయమాలకు తెలీదు. ఆ ప్రతిఫలం; ఆమె ప్రాణం.

సత్యానికి తన భార్య చెడు తిరుగుళ్ళ గురించి తెలిసింది. అతడు తొందరపడలేదు. తన అనుమానాన్ని రుజువుతో సహా నిర్ధారణ చేసుకున్నాడు. జయమాల శీలం గురించి తెలిశాక క్షమించడానికి సత్యం....ఆమె

కన్నతండ్రి కాదు. కట్టుకున్నవాడు. తన భార్యకు పరాయి మగవాళ్ళతో అక్రమ సంబంధం వుందని తెలిశాక కూడా సహించడానికో, విడాకులకోసం కోర్టుకు వెళ్ళడానికో అతడు పాశ్చాత్యుడు కాదు.

అతడు .... భారతీయుడు. ప్రాణంకన్నా మానానికే ఎక్కువ విలువనిచ్చే హైందవ నాగరికతను జీర్ణించుకొని పెరిగినవాడు. అందుకే అతడు ఈ సమస్యకు ఒకే ఒక పరిష్కారాన్ని ఎన్నుకున్నాడు.

ఆ పరిష్కారం జయమాల మరణం!!

జయమాల దారుణంగా చంపబడింది. ఆమె పొట్ట పొత్తికడుపు కత్తిపోట్లతో ఛిన్నాభిన్నమై బీభత్సంగా వుంది. ఒకటీ, రెండూ కాదు. ఎనిమిది కత్తిపోట్లు.

పోలీసులు వచ్చేసరికి, రక్తసిక్తమయిన దేహంతో, చేతిలో హత్యాయుధంతో భార్య శవం ప్రక్కనే నిలుచుని వున్నాడు సత్యం. అతడు తప్పించుకోవడానికి ఏమాత్రం ప్రయత్నించలేదు. శీలం చెడిన తన భార్యను తనే హత్యచేసినట్టు వాఙ్మూలం యిచ్చాడు సత్యం. పోలీసుల దృష్టిలో ఇటీజ్ ఎ క్లియర్ కేస్ ఆఫ్ డెలిబెరేట్ మర్డర్.

తాము వెళ్ళేసరికి జయమాల శవం నగ్నంగా వుండటంచేత, బహుశా ఎవరో ప్రియునితో జయమాల వుండగా ఆమె భర్త సత్యం గదిలో ప్రవేశించి వుంటాడని, భార్యను పరాయి మగవానితో చూసిన ఆవేశంలో సత్యం తన భార్యను హత్యచేసి వుంటాడని- అన్నది పోలీసుల కధనం.

తాను గదిలో ప్రవేశించేముందే పెరటితలుపు తెరచు

కాని ఎవరో పోతున్న సవ్వడి విన్నానని 'సత్యం స్టేట్ మెంట్ యివ్వడం చేత పోలీసుల పని మరింత' తేలికయ్యింది.

తన తరపున లాయర్‌నుకూడా పెట్టుకోలేదు సత్యం. ప్రాసిక్యూషన్ వారి వాదనకూడా నామమాత్రంగానే నడిచింది. ముద్దాయి తన నేరాన్ని స్వయంగా ఒప్పుకున్నాక యింక ఆ కేసులో పస యేముంది?

భార్యను అంత దారుణంగా హత్యచేసిన సత్యానికి ఇండియన్ పీనల్ కోడ్ 302 సెక్షన్ ప్రకారం 'ఉరిశిక్ష' విధించమని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరాడు. అయితే— హత్య గావింపబడిన పరిస్థితులను దృష్టిలో వుంచుకొని, ఇది కేవలం ఆవేశంతో చేయబడ్డ హత్యగా భావించి న్యాయస్థానం సత్యానికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది.

# 6

పెదవాల్తేరులోని 'సత్యం' ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించాడు రాంకుమార్.

ఒక విశాలమైన వీధిలో కట్టబడ్డ పురాతనమైన పెంకుటిల్లు అది. సత్యం పిత్రార్జితం. చిన్నలోగిలి, బెడ్ రూమ్, డైనింగ్ కమ్ కిచెన్. బెడ్‌రూం నుండి, వంటగదినుండి యింటి పెరడులోనికి మార్గాలున్నాయి.

"హత్య మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కదూ జరిగిందని డాక్టర్ రిపోర్టు"—యింటిలోనుండి బయటకు వస్తూ అడిగాడు రాంకుమార్.

"యస్ సర్ .... ఒంటిగంటా.... రెండుగంటల మధ్య" రాంకుమార్ వెనుకే అడుగులువేస్తూ నమ్రతగా జవాబిచ్చాడు రమేష్.

"అంటే సుమారు అందరూ లంచ్ అయ్యాక విశ్రాంతి తీసుకొనే సమయం అన్నమాట. కాని అంత దారుణంగా కత్తితో పొడిచి తనను చంపుతుంటే.... హతురాలు ఆ బాధను భరించలేక .... గట్టిగా అరిచి వుండాలి....మామూలుగా కాదు—హృదయవిదారకంగా ఆర్తనాదం చేసి వుండాలి. ఆమె అరుపులను విన్నవారు ఎవరైనా వున్నారా?"

"లేరు సర్....ఈ వీధిలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఎంక్వయిరీ చేశాం. కాని యెవ్వరూ ఆమె అరుపులను వినలేదట."

"ఒకవేళ పోలీస్ కేసులో సాక్షులుగా కూడా యిరుక్కోవడానికి యిష్టంలేక వారు .... ఏ విధమైన అరుపులనూ వినలేదని అబద్ధం చెప్పి ఉండవచ్చు కదా" సాలోచనగా రమేష్‌ను చూస్తూ అన్నాడు రాంకుమార్.

"నేనూ ముందు అలాగే అనుకున్నాను సర్....కాని పోస్టుమార్టంలో ఆమె పళ్ళమధ్య చిన్న సిల్క్ దారపు పోగు దొరకటంతో....ఆమె గదిని మరలా పరిశీలించాను. ఆమె హత్య కావింపబడిన మంచం దిండుక్రిందే లభించింది ఒక నలిగిపోయిన సిల్కు రుమాలు. ఆమె పళ్ళ మధ్య దొరికిన దారపు పోగు ఆ రుమాలులోనిదే.

అంటే—హత్య చేసేముందు జయమాల అరవకుండా హంతకుడు ఆమె నోటిలో ఆ కర్చీఫ్‌ను కుక్కి వుంటాడని, అందుకే ఆమె అరుపులను ఆ వీధిలోని యెవరూ వినలేదని నిర్ధారణ చేసుకున్నాం" రమేష్ చెప్పడం ముగించాడు.

"కాని. కర్చీఫ్ గురించి... ఆ కేసుకు సంబంధించిన ఫైలులో ఏమీ వ్రాయబడిలేదే" రమేష్‌నే సూటిగా

చూస్తూ అడిగాడు రాంకుమార్.

ఆ చూపులకు ఒక్క_క్షణం తడబడ్డాడు రమేష్.

"అది....అది....ఆ కర్చీఫ్ ను మనం ఎవిడన్స్ లో సబ్ మిట్ చేయలేదు సర్. సత్యం తనే నేరం చేశానని ఒప్పుకున్నాడుకదా....యింకెందుకని...." నీళ్ళు నములసాగాడు రమేష్.

"నో....ఇటీజ్ నాట్ ది ట్రూత్. బహుశా ఆ కర్చీఫ్ ను తన భార్య నోటిలో తను పెట్టలేదని సత్యం చెప్పివుంటాడు."

రాంకుమార్ మాటలకు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు రమేష్. "నిజమే సర్....కాని అతడు అబద్ధం ఆడుతున్నాడేమోనని...."

"నో! మిష్టర్ రమేష్! హత్యచేసి తప్పించుకోవడానికికూడా ప్రయత్నించని మనిషి, తనే హత్యచేశానని నిర్భయంగా ఒప్పుకొని పోలీసులకు లొంగిపోయిన మనిషి 'కర్చీఫ్' విషయంలో అబద్ధం చెప్పడు. సత్యం తన భార్య నోటిలో కర్చీఫ్ ను పెట్టివుండడు. ఎందుకంటే ఆమె అరచినా.... గోలచేసినా అతడు పట్టించుకోదల్చుకోలేదు గాబట్టి. అలా ప్రయత్నించేవాడైతే తప్పించుకోవడానికే ప్రయత్నించేవాడు.

నా అంచనా తప్పుకాకుంటే ఆ కర్చీఫ్ మీద వేలిముద్రలు యెవరివో తెలుసుకొనే ప్రయత్నంకూడా బహుశా మీరు చేసివుండరు. యింకెందుకులే అనవసర శ్రమ అని నిర్లక్ష్యం చేశారు. అవునా....?"

'నిజం' అన్నట్లు తలదించుకొన్నాడు రమేష్.

"అది సిల్క్_ రుమాలుకదూ అన్నారు."

"యస్ .... సార్ .... లేత ఆకుపచ్చరంగు సిల్క్_

రుమాలు. దానిపై అర్ధనగ్నంగా ఉన్న ఒక అందమైన అమ్మాయి చిత్రంకూడా ప్రింట్ చేయబడి వుంది—" తలదించుకొనే సమాధానమిచ్చాడు రమేష్.

"దేర్....యూ....ఆర్! సిల్కు రుమాల్లు....అదీ అర్ధనగ్నంగా వున్న అమ్మాయిల బొమ్మలు ప్రింట్ చేయబడ్డ కర్చీఫ్‌లను వాడేది 'సత్యం'లాంటి అమెండర్లు కాదు. విలాస పురుషులు....అదీ యువకులు అయివుంటారు"—రాంకుమార్ చెప్పడం కొనసాగించాడు.

సత్యం ఆ గదిలో ప్రవేశించేముందే జయమాలతో యింకెవరో వున్నారు. ఎవరు వారు? బహుశా అతడే ఆమె నోటిలో తన కర్చీఫ్‌ను కుక్కివుంటాడు ఎందుకు?

ఒకటి: ఆమెను బలవంతంగా అనుభవించడానికి కావచ్చు.

రెండు: ఆమెను హత్యచేయడానికైనా కావచ్చు.

జయమాల కారెక్టర్‌ను పరిశీలిస్తే....ఆమెను....అనుభవించడానికి బలవంతం చేయాల్సిన అవసరం వుండి వుండకూడదు. అయితే ఆ ఆగంతకుడు ఆమె నోటిలో గుడ్డను కుక్కింది ఆమెను హత్య చేయడానికా....?

"జెన్....హూ ఈజ్ దట్ బ్లడీ స్కౌండ్రల్."

రాంకుమార్ మాటల్లోని లాజిక్‌కు తల తిరిగిపోయింది రమేష్‌కు. 'మై గుడ్ నెస్! ఈ సి. బి. ఐ. ఆఫీసర్ ఈ కేసును ఎక్కడికి తీసుకువెళ్తున్నాడు' అనుకున్నాడు రమేష్.

"మిష్టర్ రమేష్! హత్యజరిగిన సమయంలో ఈవీధిలో ఎవరైనా తిరుగాడినట్లు....యెవరైనా చూశారేమో ఎంక్వాయిరీ చేయండి. ముఖ్యంగా క్రొత్తవారు ఎవరైనా కన్పించారేమో....కనుక్కోవాలి"-జీపులో కూర్చుంటూ

అన్నాడు రాంకుమార్.

కర్చీఫ్ గురించి అనవసరంగా నోరు జారినందుకు తనను తాను తిట్టుకొంటూ అతని ప్రక్కనే కూర్చున్నాడు రమేష్. డ్రైవర్ జీపును స్టార్టుచేశాడు.

"సీ.... పెరల్" అన్నాడు రాంకుమార్.

జీప్ను బ్యాక్ చేసి హోటల్ సీ.... పెరల్ వైపుగా నడపసాగాడు డ్రయివర్. రాంకుమార్ మౌనంగా తన చేతిలోని ఫైలును తెరచి చూడసాగాడు.

# 7

సరిగ్గా ఇరవై నాలుగు గంటల తరువాత రమేష్ తన ఇన్వెస్టిగేషన్ రిపోర్టు రాంకుమార్కు సబ్మిట్ చేశాడు. రిపోర్టును ఆసాంతం పూర్తిగా చదివి 'గుడ్ వర్క్' అంటూ ప్రశంసాపూర్వకంగా రమేష్ భుజం తట్టాడు.

వాళ్ళిద్దరూ యిప్పుడు 'హోటల్ సీపెరల్'లోని రాంకుమార్ గదిలో కూర్చుని వున్నారు.

"సో! హత్య కావింపబడటానికి కొన్ని నెలలముందు నుండీ.... జయమాల ఒక గెడ్డపు యువకునితో తిరుగుతూంది. ఆ రోజు హత్య జరిగిన సమయంలో.... అంటే మధ్యాహ్నం సుమారు ఒంటిగంటా రెండుగంటలమధ్య జయమాల యింటి పెరడు ఉన్న వీధి సందులో ఆ గడ్డపు యువకుడు కనిపించాడు"—అన్నాడు రాంకుమార్.

"ఎస్ సర్! ఆ వీధి సందు మొదలులో 'అపరాధ పరిశోధన' అంటే చెవి కోసుకొనే ఒక స్టూడెంట్ వున్నాడు కాని అతడు చెబుతున్న దాన్నిబట్టి—అతడు అదే సమయంలో ఆ వీధి సందులో పువ్వుల చొక్కా వేసుకొన్న మరో యువకుణ్ణి కూడా చూశాడు. అతడు

జయమాల మాజీ ప్రియుల్లో ఒకడు...."—చెప్పాడు రమేష్.

"ఈ ఫోటోకు కాస్త గడ్డాలూ, మీసాలూ తగిలించి మీ స్టూడెంట్‌కు చూపించు బ్రదర్. బహుశా అతడు చూసిన గడ్డపు యువకుడు ఇతడే అవుతాడు" అన్నాడు రాంకుమార్.

"కాని....ఇది....ఇది....'రాజేంద్ర' అంటే ఆ ఫోటోగ్రాఫర్ ఫోటో కదు సర్"—ఆ ఫోటో వంకే పరిశీలనగా చూస్తూ అడిగాడు రమేష్.

"ఎస్ మిస్టర్ రమేష్. ఈ మధ్య తరచుగా రాజేంద్ర విశాఖ వస్తున్నాడు. ఎందుకు? ఆ గడ్డపు యువకుడు కూడా ఈమధ్యే జయమాలకు క్రొత్త ప్రియుడయ్యాడు. జయమాల మరణ సమయంలో ఆ ప్రాంతంలో ఆ గడ్డపు యువకుడు ఉన్నాడు. రాజేంద్ర ఫోటో ఎగ్జిబిషన్ లోని 'మరణ భీతి' జంట కన్నుల ఫోటో....జయమాలది. అందులో ఆమె కన్నుల్లో 'చావు కళ' ఉట్టిపడుతుంది."

"రాజేంద్రకు ఆ ఫోటో ఎలా వచ్చింది?"

"వన్ ప్లస్ వన్ ఈజ్ ఈక్వల్ టు టూ. రాజేంద్రే ఆ గడ్డపు యువకుడు అవడానికి ఛాన్స్ ఉన్నాయేమో ఆలోచించు" రిలాక్సింగ్‌గా సోఫాలో వెనక్కి వాలుతూ చెప్పడం ముగించాడు రాంకుమార్.

"మరి....ఆ పువ్వుల పర్సు..."

రమేష్ మాటలను మధ్యలోనే కట్ చేశాడు రాంకుమార్. "ముందు ఆ గడ్డపు యువకుని వ్యవహారం చూడు బ్రదర్. క్విక్!"

రాంకుమార్‌కు సెల్యూట్ చేసి ఆ గది బయటకు నడిచాడు రమేష్.

రమేష్ గదిలో నుండి వెళ్ళిపోయాక రెండు నిముషాల తరువాత ఆపరేటర్‌కు రింగ్ చేశాడు రాంకుమార్. విజయనగరం సి. ఐ. గోవిందరావుకు ట్రంకాల్ బుక్ చేశాడు.

అరగంట గడిచేసరికి ఆ గదిలోని ఫోన్ మ్రోగింది. రిసీవరు అందుకొన్నాడు రాంకుమార్. అది రమేష్ చేస్తున్న ఫోన్ కాల్.

“సర్ ....యువర్ ఎక్స్‌పెక్టేషన్ ఈజ్ కరెక్ట్. తను చూసిన గడ్డపు యువకుడే రాజేంద్ర అంటున్నాడు ఈ స్టూడెంట్” రమేష్ గొంతులో ఒక రకమైన ఎగ్జయిట్‌మెంట్.

సన్నని చిరునగవు రాంకుమార్ పెదవులపై నర్తించింది. “మీ అపరాధపరిశోధకుడిని అదే మీ స్టూడెంట్‌ని కూడా మీతో పాటు తీసుకురండి మిష్టర్ రమేష్!”— అంటూ రిసీవరును క్రెడిల్ మీద పెట్టేశాడు రాంకుమార్.

ఫ్రిజ్ తెరచి అందులో నుండి ఒక ‘మజా’ బాటిల్ తీసి సిప్ చేస్తూ కూర్చున్నాడు. రమేష్ వస్తే అతడికి చెప్పాల్సిన విషయాలు మననం చేసుకోసాగాడు.

అదే సమయంలో అతడి ఏకాగ్రతను భంగపరుస్తూ ఆ గదిలోని టెలిఫోన్ రెండవసారి మ్రోగింది. ‘ఆపరేటర్’ గొంతు మృదువుగా వినిపించింది.

“విజయనగరం ట్రంకాల్ సర్! సి. ఐ. గోవిందరావు ఈజ్ ఆన్ దట్ సైడ్.”

ఫోన్‌లో గోవిందరావు గొంతు వినిపించసాగింది.

తను అడిగిన ప్రశ్నకు గోవిందరావు యిచ్చిన సమాధానం వినేసరికి నవ్వుల మయం అయింది రాంకుమార్

ముఖం.

"సో... ద బర్డ్ రిచ్ డ్ ద నెట్టు! థాంక్యూ ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్ మేషన్ .... ఉంటానూ" అంటూ రాంకుమార్ మాట్లాడం ముగించేసరికి ఆ స్టూడెంట్ తో సహా ఆ గదిలోకి ప్రవేశించాడు రమేష్.

ముగ్గురూ సోఫాల్లో సెటిలయ్యారు. ఆ స్టూడెంట్ పేరు నరసింహం. అందరు ముద్దుగా 'చాను' అని పిలుస్తారు. అలా పిలిపించుకోవడమంటే అతడికి యిష్టం కూడానూ.

యిలాంటి పోలీసు ఎంక్వయిరీల గురించి తన అభిమాన మాసపత్రిక 'అపరాధ పరిశోధన'లో ఎన్నోమార్లు చదివాడు 'చాను'. కాని నిజ జీవితంలో తానే ఆ ఎంక్వయిరీలో పాల్గొనవలసి వచ్చేసరికి ఎంతో ఖంగారుగా వుంది. అరచేతులకు పడుతున్న చెమటను పాంటుకు రుద్దుకుంటూ సోఫాలో యిబ్బందిగా కదిలాడు 'చాను'.

"మిష్టర్ చానూ....! ఆ రోజు అంటే హత్యజరిగిన సమయంలో ముందుగా మీరు యెవరిని చూశారు?" సంభాషణను ప్రారంభిస్తూ అడిగాడు రాంకుమార్.

"ఆ గెడ్డపు యువకుడ్ని సర్"—టక్కున చెప్పాడు చాను.

"అప్పుడతడు ఏం చేస్తున్నాడు?"

"నడుస్తున్నాడు సర్...."

'చాను' సమాధానం విని ఫక్కుమని నవ్వారు రమేష్, రాంకుమార్. వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో తెలియక బిక్క మొహం వేశాడు చాను. కాని నవ్వుతున్నది తన మాటలకేనని తెలిసిన మరుక్షణం సిగ్గుతో బుగ్గలు ఎర్రవారాయి.

"నిజం....సర్! అప్పుడతడు నడుస్తున్నాడు. చేతి కర్చీఫ్‌తో ముఖానికి పట్టిన చమటను తుడుచుకొంటూ తల వంచుకొని మెల్లగా నడుస్తున్నాడు. అప్పుడు అతని భుజానికి యేదో వ్రేలాడుతుండికూడానూ. అది....అది... ఆ....! కమేరా సర్....దానికి 'ఫ్లాష్'కూడా వుంది."

తల వంచుకొనే గబ, గబా చెప్పాడు చాను. అతని గొంతులో నిజం చెబుతుంటే నవ్వుతారేం అన్న ఉక్రోషం వుంది.

"వెల్ మిష్టర్ చానూ మరి ఆ పువ్వుల చొక్కా యువకుడిని యెప్పుడు చూశావు?" చానూ భుజాన్ని తడుతూ అడిగాడు రాంకుమార్.

రాంకుమార్ అంతటి సి.బి ఐ. ఆఫీసర్ తనను 'వెల్' అని భుజం తట్టేసరికి ఆనందంతో ఉబ్బి, తబ్బిబ్బు అయి పోయాడు చాను.

"గడ్డపు యువకుడు వెళ్ళిపోయిన ఐదూ....పదినిము షాల లోపలే ఆ పువ్వుల చొక్కా వేసుకొన్న యువ కుడూ వచ్చాడు సర్. నేను నా గదిలో కిటికీ ప్రక్కనే కూర్చుని అపన చదువుకొంటున్నాను. మనిషి చాలా గాభరాగా పరుగెడుతున్నట్లు నడుచుకుంటూ.... అదే సందులోనుండే వస్తూండేసరికి నాకు అనుమానం వచ్చింది. అనుమానం ఆపరాధ పరిశోధనకు మొదటి మెట్టు కదు సర్."

అమాయకంగా అడుగుతున్న 'చాను' మాటలకు వస్తున్న చిరునవ్వును పెదవుల మధ్య బిగపట్టి 'ఔను' అన్నట్లు బుద్ధిగా తలూపాడు రాంకుమార్. చాను మరింత ఉత్సాహంతో చెప్పసాగాడు. యిప్పుడతని గొంతులో 'బెరుకు' పూర్తిగా పోయింది.

"మరేమో! అతడి మొహంనిండా చెమటలు పట్టి వున్నాయి సర్. నడుస్తూ.... నడుస్తూ.... పాంటు జేబులు తడుముకొన్నాడు. బహుశా కర్చీఫ్ తేవడం మరచిపోయి వుంటాడు. ఎందుకో యేదో గుర్తు వచ్చినట్లు ఆగాడు. ఒక్క అడుగు వెనక్కు వేసి మరలా యేదో నిశ్చయానికి వచ్చినట్లు వడి, వడిగా అడుగులు వేసుకొంటూ వెళ్ళి పోయాడు."

అంతవరకూ చాను చెప్పినదంతా ఓపిగ్గా విన్న సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్.... ఆత్రంగా అడిగాడు.

"మళ్ళీ ఈసారి అతడిని చూస్తే నీవు గుర్తుపట్టగలవా చానూ?"

"డెఫెనెట్లీ సర్"—అన్నాడు చాను.

## 8

అది మునిసిపల్ గ్రౌండ్స్‌లో 'రాజేంద్ర'కోసం వేయబడ్డ టెంట్. తనకోసం యెవరో పోలీసు అధి కారులు వచ్చారనేసరికే యేదో భయం ఆవహించింది రాజేంద్రను. ఎదురుగా సి బి ఐ. ఆఫీసర్ రాంకుమార్‌ను చూసేసరికి గొంతులో తడి ఆరిపోయింది. తడబడుతూ వారిని టెంట్‌లోనికి ఆహ్వానించాడు.

టెంట్‌లో వేయబడ్డ కుర్చీలలో కూర్చున్నారు వారు. రాంకుమార్ కనుసైగను అందుకొని రమేష్ తన ఎంక్వయిరీ ప్రారంభించాడు.

"జయమాలతో మీకు ఎన్నాళ్ళుగా పరిచయం.... మిస్టర్ రాజేంద్రా?"

సబ్ ఇన్‌స్పెక్టరు అకస్మాత్తుగా వేసిన ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు రాజేంద్ర. తన ముఖంలోని కలవర పాటును దాచుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తూ....

"ఏ జయమాల ఇన్‌స్పెక్టర్ గారూ" అన్నాడు మెల్లగా.

"మీరు గడ్డం పెట్టుకొని నా లేని సందులలో ఎవరి కోసం తిరిగారో .... ఆ జయమాల .... రాజేంద్రా!" రమేష్ కంఠం వ్యంగ్యంగా పలికింది.

"నేను.... నేను గడ్డం పెట్టుకోవడ మేమిటండీ...." అపనమ్మకంగా అన్నాడు రాజేంద్ర.

"ఇక మీరు తప్పించుకోలేరు రాజేంద్రా! జయమాల హత్య కావింపబడిన సమయంలో మీరు ఆ యింటిలో నుండి రావడం చూసిన ప్రత్యక్ష సాక్షులు వున్నారు."

"ఈ ఫోటో మీది కాదా"—అంటూ జేబులోనుండి, గడ్డాలూ, మీసాలూ జాగ్రత్తగా స్కెచ్ చేయబడ్డ రాజేంద్ర ఫోటోను విసురుగా తమ మధ్యనున్న టీపాయ్ మీదకు గిరవాటు వేశాడు రమేష్.

"ఈ ఫోటోలోని కళ్ళు జయమాలవు కావా? ఈ ఫోటో ఆమె మరణ సమయంలో తీయబడింది కాదా?" జేబులోనుండి విసురుగా 'మరణ భీతి' జంట కన్నుల ఫోటోను తీసి మరింత విసురుగా టీపాయ్‌మీద పడేస్తూ అన్నాడు రమేష్.

"కాని.... కాని నాకు ఆమె మరణంతో ఏ సంబంధమూ లేదు" తడి ఆరిపోయిన రాజేంద్ర గొంతులో నుండి మాటలు నూతిలోనుండి వస్తున్నట్లుగా వున్నాయి. ఆ రెండు ఫోటోలను చూసినప్పుడే అతని ముఖం రక్తం యింకిపోయినట్లు తెల్లగా పాలిపోయింది. అతని పెదవులు సన్నగా వణుకుతున్నాయి.

"కాని హత్య జరిగిన సమయంలో మీరు అక్కడే వున్నారు రాజేంద్రా!" అంతవరకూ మౌనంగా వున్న

రాంకుమార్ రాజేంద్ర వంకే సూటిగా చూస్తూ అడిగాడు.

"మీ రీ మధ్య తరచుగా విశాఖపట్నం యెందుకు వస్తున్నారు? గడ్డంతో మారువేషంలో జయమాల యింటికి తరచుగా యెందుకు వెళ్తున్నారు....? ఆమెకు మీకూ యేమిటి సంబంధం?"—రమేష్ కురిపించన ప్రశ్నల వర్షానికి మరింత బెంబేలెత్తి పోయాడు రాజేంద్ర.

"నే నే పాపం యెరుగను ఇన్‌స్పెక్టర్! నన్ను నమ్మండి!" అంటూ చిన్నపిల్లాడిలా బావురుమన్నాడు రాజేంద్ర. రెండు చేతులతో ముఖం దాచుకొని దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నించాడు.

గుడారం మూలనున్న టేబిల్ మీద కూజాలో నుండి గ్లాసులోకి మంచినీళ్ళను నింపి రాజేంద్ర యెదురుగా టీపాయ్‌మీద పెట్టాడు రాంకుమార్. రాజేంద్ర భుజాన్ని తడుతూ—

"రిలాక్స్ యంగ్ మాన్! ముందు యీ మంచినీళ్ళు త్రాగు" అంటూ గ్లాసును అందించాడు. గ్లాసులోని నీళ్ళన్నీ గటగటా త్రాగేశాడు రాజేంద్ర. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొన్నాడు.

"ఇప్పుడు చెప్పండి రాజేంద్రా! అసలేం జరిగింది? నిజాన్ని దాచకుండా నిర్భయంగా చెప్పండి. మీరు నేరం చేయనివాడు యే న్యాయస్థానమూ, ఏ చట్టమూ మిమ్మల్ని శిక్షించలేదు" నెమ్మదిగా రాజేంద్రను అనునయిస్తున్నట్లు అన్నాడు రాంకుమార్.

మెల్లగా లేచి కూజాలోని నీళ్ళతో ముఖం కడుక్కొన్నాడు రాజేంద్ర. మరికాసిని నీళ్ళు త్రాగాక వచ్చి

కుర్చీలో కూర్చున్నాడు. ఒక్కసారి సాలోచనగా రాం కుమార్ వైపు చూసి, చెప్పడం ప్రారంభించాడు.

"విశాఖపట్టణం యేదో పనిమీద వచ్చిన నేను 'సంఘం'లో సినిమా చూద్దామని వెళ్ళాను. అప్పటికే ప్రేక్షకులు 'క్యూ' కట్టి వున్నారు. క్యూలో నిలుచుని అమ్మాయిల క్యూ వంక చూశాను. నాకు చిన్నతనంనుంచీ ఫోటోగ్రఫీ అంటే ప్రాణం. ఎవరిని చూసినా వాళ్ళు ఫోటోజెనిక్ అవునా కాదా?" అన్న దృష్టితో పరిశీలనగా చూసేవాణ్ణి.

అలా ఆ క్యూలోని అమ్మాయిలను ఒక్కొక్కరిని పరిశీలనగా చూస్తూ ముందుకు పరుగెడుతున్న నా కళ్ళు టక్కున బ్రేకులు వేసినట్లు ఒక యువతి దగ్గర ఆగిపోయాయి. పాతికేళ్ళలోపే వుంటుంది ఆమె వయసు. చక్కగా తీర్చిదిద్దిన శిల్పంలా వుంది. అన్నింటికంటే ఆమె కళ్ళు....ద మోస్టు బ్యూటిఫుల్ ఐస్ ఐ హేడ్ ఎవ్వర్ సీన్.

అదొక రకమైన మత్తు గొలిపే చూపు. బరువుగా వాలే కనురెప్పలు. ఆమెవి సెక్సీ ఐస్. ఒక్కసారి యే మగవాడినైనా కన్నెత్తి చూసిందంటే చాలు....తెలియని తాపంతో విలవిల లాడి పోవల్సిందే—ఆ మగాడు.

రెప్ప వాల్చకుండా ఆమెనే చూస్తూండిపోయాను. వెనుక క్యూలో వున్నతను నన్ను ముందుకు త్రోయడంతో ఉలిక్కిపడి తేరుకొన్నాను. కౌంటర్ చేరేంతవరకూ ఆమెవైపే దొంగచూపులు చూస్తూ ఉన్నాను. నాకు ఆనందం కల్గించిన విషయం యేమిటంటే ఆమె కూడా రెండు, మూడుసార్లు అలవోకగా నన్ను చూడటం.

ఆ రోజు నా లక్ బాగుంది అనుకొంటూ. ఆమెదీ, వాదీ ప్రక్క ప్రక్క సీట్లు పడ్డాయి. ఆమె ఒంటరిగా వచ్చిందని తెలుసుకోడానికి నాకు యెంతోసేపు పట్టలేదు....

మెల్లగా మాటలు కలిపాను. చీకట్లో చూడనట్లు ఆమెకు చేయి తాకించినా, భుజానికి భుజం తగిలించినా ఆమె ఏమీ అభ్యంతరం పెట్టకపోయేసరికి నాకు ధైర్యం వచ్చింది. ఆ తర్వాత మేమిద్దరం సినిమా చూడటం మానేశాం. ఆమే జయమాల.

సినిమా పూర్తయ్యాక లాడ్జికి వెళ్దామన్నాను నేను. కాదు, తన యింటికే రమ్మంది ఆమె. అంత అందమైన యువతిని ట్రాప్ చేయగల్గినందుకు నన్ను నేనే అభినందించుకొన్నాను. కాని, ఆమే నన్ను ట్రాప్ చేసిందని ఆమె వ్యామోహంలో పడి నేనే కొట్టుకుపోతున్నానని కొన్ని నెలలు గడిచాక గాని తెలుసుకోలేకపోయాను. అప్పటికే నా జేబు ఖాళీ .... అయింది .... మనసు కూడా ....

ఆమె కోసమే తరచుగా విజయనగరం నుండి విశాఖ వస్తూండేవాడిని. అయితే ఇప్పుడిప్పుడే ఫోటోగ్రాఫర్ గా మంచి పేరు తెచ్చుకొంటున్న సమయంలో ఎవరయినా నన్ను చూస్తే నా కేరీర్ దెబ్బతినవచ్చునే భయంతో గడ్డం, మీసాలూ పెట్టుకొనేవాడిని. జయమాల కూడా గడ్డం ఉంటే నేను కబీర్ బేడీ లా ఉంటానని మెచ్చుకోవడంతో ఆ వేషం కంటిన్యూ చేశాను.

ఓ వంక నా ఫోటో ఎగ్జిబిషన్ కు ఫోటోలు సేకరించసాగాను. రాత్రి, పగలూ అనక అపురూపమైన ఫోటోలు తీయడానికి ఎక్కడెక్కడికో తిరిగేవాడిని. కాని

జయమాలమీద వ్యామోహం చంపుకోలేక యెలాగోలా తీరిక చేసుకొని విశాఖపట్టణం వెళ్తూండేవాడిని.

'మరణభీతి' అన్న ఫీచర్‌కు కావాల్సిన ఫోటోల కోసం తిరుగుతున్నాను నేను. అసలు మరణభీతి అన్న ఫీచర్ ఆలోచనే నాకు గమ్మత్తుగా కలిగింది.

మా వీధిలో ఒక కుర్రవాడుండేవాడు. వాడిని పిచ్చి కుక్క కరిచింది. అయితే ఆ సంగతి వాడి తల్లితండ్రులకు తెలిసేసరికే జబ్బు ముదిరిపోయింది. వారు కూడా సరైన వైద్యం చేయించకుండా యేవో నాటు వైద్యపు చిట్కాలు వాడటంతో....ఆ కుర్రవాడి ప్రాణంమీదకు వచ్చింది.

అదే సమయంలో నేను ఆ అబ్బాయిని చూడటానికి వెళ్ళాను. నా కళ్ళముందే కుక్కలా అరుస్తూ చని పోయాడు ఆ అబ్బాయి. అంత విషాదంలోనూ నా ఫోటో గ్రాఫర్ కళ్ళను ఆకర్షించినవి మరణానికి ముందు ఆ అబ్బాయి కళ్లు. జీవంలేని ఆ కళ్ళలో లీలగా మెదిలిన భయం.

'ఆ భయాన్నే .... కెమేరాలో బంధించగల్గితే!' అనిపించింది నాకు. ఆ ఆలోచన కార్యరూపమే 'మరణ భీతి' పీచర్. ఎవరైనా యింట్లో ఒక మనిషి చనిపో బోతున్నాడని తెలిస్తే చాలు .... అక్కడకు పరుగెత్తే వాడిని. ఈ నా ప్రయత్నంలో ఎన్ని ఎదురు దెబ్బలు తిన్నానో!

ఎన్నో ఫోటోలను సేకరించాను. కాని 'మరణ భీతి' ఫీచర్‌కు సరిగ్గా న్యాయంచేసే ఫోటోను మాత్రం సంపా దించలేక పోయాను.

'అందమైన కళ్లు...భయంతో జీవంలేక పాలి

పోతే కనురెప్పలు విప్పార్చుకొని ఆ కళ్ళు విశాలమైతే.... మరణం ఆసన్నమయిందని తెలుసుకున్న క్షణంలో ఆ కంటిపాపల్లో తటిల్లతలా మెరిసే.... భీతి మరణ భీతి' అదీ నాకు కావల్సింది.

కాని ఎలా....? హౌ టు గెట్ దట్ కేర్ ఎక్స్‌ప్రెషన్. యెందుకో నాకు అకస్మాత్తుగా జయమాల అందమైన కళ్ళు గుర్తుకు వచ్చాయి. అవును నాకు కావాల్సిన కళ్ళు అవే అనిపించాయి. కాని....ఆ కళ్ళల్లో నాకు కావాల్సిన ఎక్స్‌ప్రెషన్ ఎలా వస్తుంది? ఆలోచించసాగాను....'ఎలా ...?....ఎలా....?' అని.

ఇరవై నాలుగు గంటలు గడిచేసరికి నా మనసులో రూపు దిద్దుకోసాగింది ఒక పథకం. ఆ పథకానికి పూర్తి రూపం వచ్చిన మరుక్షణం విశాఖ బయలుదేరాను నేను.

ఆ రోజు మధ్యాహ్నం....జయమాల ఇంటికి వెళ్ళాను. ఆ సమయంలో ఆమె భర్త వుండడని నాకు తెలుసు.

నా కెమేరాను మంచం ప్రక్కనే వున్న చిన్న స్టూల్ పై వుంచాను. అప్పటికే జయమాల నగ్నంగా తయారై మంచంమీద పడుకొని నాకోసం యెదురు చూస్తోంది.

నేను మంచంమీదకు వంగాను. జయమాల నవ్వుతూ చూస్తూంది. నేను జేబులోనుండి బటన్ నైఫ్‌ను తీసాను. బటన్ నొక్కేసరికి నైఫ్ విచ్చుకుంది. బెడ్ లైట్ వెలుగులో కూడా ఆ స్టీల్ బ్లేడ్ తళ, తళా మెరుస్తూంది.

నా వైపూ, నా చేతిలోని నైఫ్ వైపూ వింతగా చూసింది జయమాల.

నా గొంతులోకి కర్కశత్వాన్ని తెచ్చిపెట్టుకున్నాను.

'ఎవడు వాడు? వాడికీ నీకూ యేమిటి సంబంధం?' నా గొంతు కీచుగా అరిచింది. ముందు విస్తుబోయింది జయమాల.

"ఎవరు? బాబా? అతడిదీ .... మాదీ ఒకే వీధి.... పెళ్ళికాకముందు కాస్త పరిచయం, నాన్నగారు యేదో కబురు చెపితే....వచ్చాడు అంతే!" ఖంగారు ఖంగారుగా చెప్పింది జయమాల.

కాని, జయమాల సమాధానం విసేసరికి నాకు మతి పోయింది. నాకు ఈమధ్య రెండు ఆకాశరామన్న ఉత్తరాలు వచ్చాయి. అందులో జయమాలతో సంబంధం త్రెంచుకోకపోతే, చాలా విషమ పరిస్థితులను యెదుర్కొనవలసి వస్తుందని బెదిరించాడు నన్ను ఆ ఆకాశరామన్న.

అందుకే 'ఎవడు వాడు?' అని జయమాలను బెదిరించేసరికి వీడెవడో 'బాబు' పెళ్ళికాక ముందు పరిచయం.... అందుకే వచ్చాడు....అంటూంది. సరే! నేను ఆడబోయే నాటకానికి 'వీడినే' బేస్ గా తీసుకుందామనుకున్నాను. ఒక్కసారి వికటంగా నవ్వాను.

"బాబో.... డాబో.... ఈ మధ్య తరచుగా నీ దగ్గరకెందుకు వస్తున్నాడు?" కత్తి మొనతో ఆమె నగ్న దేహంపై గీతలు గీస్తూ అడిగాను నేను.

భయంతో ఆమె ముఖం పాలిపోయింది. పెదవులు వణుకుతున్నాయి. 'అంటే నాకు కావాల్సిన మూడ్ లోకి వస్తూందన్నమాట.'

"బాబు! నీతో తిరుగుతున్నందుకు నన్ను బెదరిస్తున్నాడు రాజేంద్రా. కాని....కాని నీకు తెల్సుగా నీవంటే నాకు ప్రాణమని."

జయమాల మాటలతో మరోమారు షాక్ తిన్నాను నేను.

"అమ్మ బాబూ! అయితే నీవు జయమాలను కూడా భయపెడుతున్నావన్న మాట" కసిగా అనుకున్నాను నాలో నేను.

ఈసారి కోపంతో నిజంగానే జేవురించింది నా ముఖం. తను యే ఆడదానికోసం తపించిపోతున్నాడో ఆ ఆడది యింకో మగాడితో తిరుగుతుందని తెలిస్తే సహించడం యే మగాడికైనా కష్టమే!

"ఆ బాబుకూ, నీకూ యే సంబంధమూ లేదంటావు?" కర్కశంగా అడిగాను నేను.

"లేదు రాజేంద్రా! బాబు నాకు తమ్ముడు లాంటి వాడు. చిన్నతనం నుండీ బాబును నా తమ్ముడిలాగే చూసుకొన్నాను. కాని....కాని అతడే నన్ను వాంఛిస్తున్నాడు. నేను కాదన్నానని నన్ను భయపెడుతున్నాడు...." వణుకుతున్న గొంతుతో చెప్పింది జయమాల.

నా మనస్సు తేలికయింది. ఒక్కసారి బరువుగా నిట్టూర్పు వదిలాను. కాని మరుక్షణం నా ప్లాన్ గుర్తుకు వచ్చింది. అంతే! కళ్ళతో నిప్పుల వర్షం కురిపిస్తూ కోపంగా అరిచాను నేను.

"లేదు మాలా! నీకూ వాడికీ యేదో సంబంధం వుంది. ఇక నిన్ను ప్రాణాలతో వదలను"—అంటూ కత్తిని పైకి ఎత్తాను.

భయంతో నోట మాటరాక బొమ్మలా ఉండిపోయింది జయమాల. తెల్లగా పాలిపోయిన ఆమె ముఖంలో జీవంలేని గాజు గోళీల్లా ఉన్నాయి ఆమె

కళ్ళు. భయంతో విప్పార్చుకొని వెడల్పయినాయి ఆమె కళ్ళు. నల్లని ఆ కనుపాపల్లో లీలగా కదలాడుతున్న భీతి. మరణభీతి అదే....అదే నాకు కావాల్సిన రేర్ ఎక్స్ప్రెషన్!!

అప్పటికే నా ఎడంచేతితో స్టూల్ మీద కెమెరా అందుకొన్నాను. నా చేతిలోని పిడిబాకు వంకే కళ్ళార్పకుండా చూస్తోంది జయమాల. కెమెరా అందుకొన్న మరుక్షణం మెరుపుకన్నా వేగంగా కదిలాను. ఫోటోగ్రఫీలో యిన్నేళ్ళ నా అనుభవం, నా కార్యదీక్ష నాకు ఆ లాఘవాన్ని ప్రసాదించాయి.

ఎడమచేతితో కెమేరాను పొజిషన్ లోకి తీసుకోవడం కుడిచేతిలోని నైఫ్ ను పారేయడం—కెమెరా ట్రిగ్గర్ నొక్కటం అంతా కేవలం ఒక్క క్షణం....అంతే!—

కెమేరా ఫ్లాష్ కళ్ళు జిగాల్ మనేసరికి ఒక్క క్షణం నిశ్చేష్టురాలయింది జయమాల. నేను అంతవరకూ ఆడినది నాటకమని, ఆమెను బెదిరించడం కేవలం నాకు కావాల్సిన మరణభీతి ఎక్స్ప్రెషన్ కోసమేనని చెప్పేసరికి చెప్పలేని యేదో ఆనందంతో నా గుండెలకు అతుక్కుపోయింది జయమాల.

ఇంతలో యేదో అలికిడి అయినట్లనిపించింది. ఎవరో మెల్లగా నడుస్తున్న సవ్వడి. నేను నా కెమేరా అందుకొని బయటకు పారిపోయాను. కాని ఆ ఆత్రుతలో నా బటన్ నైఫ్ ను అక్కడే మరచిపోయాను.

వెంటనే విజయనగరం వచ్చేశాను. ఆ మరునాడు పేపర్ లో చదివేటంతవరకూ నాకు జయమాల హత్య గురించే తెలియదు సర్. మా మధ్య నున్న అక్రమ సంబంధం గురించి తెలిసి ఆమె భర్త సత్యమే ఆమెను

చంపి ఉంటాడని అనుకొన్నాను. అదే నిజమయింది కూడానూ.

అంతకంటే నాకేం తెలియదు సర్, కాకుంటే మరణ భీతి ఫోటో గురించి మీరు అడిగినప్పుడు 'నాకేం తెలియదు' అన్నాను.

ఆమె మరణానికి కొద్ది నిముషాల ముందు నేను యీ ఫోటో తీశానని యెవరయినా యెలా చెప్పగలరు సర్?"

—నుదుటికి పట్టిన చెమటను తుడుచుకొంటూ చెప్పడం పూర్తిచేశాడు రాజేంద్ర. "నన్ను నమ్మండి సర్" అని అర్థిస్తున్నట్లు వున్నాయి సజలపూరితము లయిన అతని కళ్ళు.

"ఇట్సాల్ రైట్ మిస్టర్ రాజేంద్రా! మీరు చెప్పినదంతా నిజం కావాలనే ఆశిస్తాను. కాని మీరు మా అనుమతి లేకుండా విశాఖపట్టణం విడిచి వెళ్ళకండి. ఆఫ్ కోర్స్ రెండురోజులే అనుకోండి" అంటూ లేచి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు రాంకుమార్.

రమేష్‌కు మాత్రం తల తిరిగిపోతోంది. 'మళ్ళీ కేసు మొదటికి వచ్చింది. ఇప్పుడు మరలా ఆ పువ్వుల చొక్కా యువకుని గురించి వేటాడాలి కాబోలు' అనుకొంటూ కాళ్ళీడ్చుకొంటూ రాంకుమార్‌ను అనుసరించాడు.

## 9

హోటల్ సీ పెరల్‌లోని తన రూమ్‌లో కూర్చుని దీర్ఘాలోచనలో మునిగిపోయాడు రాంకుమార్. అతని కెదురుగా సబ్ యిన్‌స్పెక్టర్ రమేష్ కూర్చొని వున్నాడు.

వారి మధ్యనున్న టేబిల్ మీద ఓపన్ చేయబడ్డ 'షివాస్ రీగల్' బాటిల్, రెండు పెగ్గుల నిండా నింపబడ్డ

ఆ బాటిల్ లోని ద్రవం వుంది. ఒక ప్లేటులో వేయించిన '[illegible] నట్స్' ఉన్నాయి. వారు నెమ్మదిగా ఆ డ్రింక్ ను సిప్ చేస్తున్నారు.

"నాకు ఈ కేసేమిటో అస్సలు అర్థం కావటంలేదు సర్" అన్నాడు రమేష్. అతనివంక చిరునవ్వు నవ్వుతూ చూశాడు రాంకుమార్.

"హంతకుడు మనకు చాలా అందుబాటులో వున్నాడు రమేష్"—అన్న రాంకుమార్ వంక ఆశ్చర్యంగా చూశాడు రమేష్. ఒక్కసారి గొంతు సవరించుకొని చెప్పటం ప్రారంభించాడు రాంకుమార్.

"ప్రస్తుతానికి మనం రాజేంద్ర చెప్పినదంతా కరెక్టే అనుకుందాం. అంటే యిప్పుడు ఈ కేసులో 'బాబు' అనే కొత్త పాత్ర ఒకటి ప్రవేశించింది.

జయమాలకు బాబు చిన్నతనం నుండీ తెలుసు. అతనిలో ఆమె తన తమ్ముడిని మాత్రమే చూసుకొంది. కాని బాబు మాత్రం ఆమెను కామదృష్టితో చూశాడు. దానికి కారణం బహుశా అదుపు తప్పిన ఆమె ప్రవర్తన, ఆమెకున్న అక్రమ సంబంధాలు కావచ్చు.

పదిమంది పరాయి మగవాళ్ళతో తిరిగిన ఆడది తన విషయం వచ్చేసరికి 'తమ్ముడూ' అంటూ నీతి కబుర్లు చెప్పడం ఏ మగవాడూ భరించలేడు.

రాజేంద్రను బెదిరించిన ఆకాశరామన్న జయమాలను బెదిరించిన బాబు ఒక్కరే కాబట్టి—తనకు దక్కని ఆమె యింకెవరికీ దక్కకూడదని బాబు ఆమెను హత్య చేయడానికి ప్రయత్నించినా మనం ఆశ్చర్యపోనవసరం లేదు.

ఇక మీ స్టూడెంటు చెప్పిన విషయం కరెక్టే అను

అంటే రాజేంద్ర తర్వాత వచ్చిన పువ్వుల చొక్కా యువకుడు, జయమాల నోటిలో కర్చీఫ్ కుక్కిన వ్యక్తి ఒక్కరే అయివుంటారు.

"బాబే ఆ పువ్వుల చొక్కా యువకుడు అనుకొంటే" అర్థోక్తిలో ఆపేశాడు రాంకుమార్.

"యురేకా" అని గట్టిగా అరవబోయి ఆగిపోయాడు రమేష్. కేసంతా మంచు తెరలా విడిపోయింది. బాబు కమ్ ఆకాశరామన్న కమ్ పువ్వుల చొక్కా కమ్ సిల్కు రుమాల్ వ్యక్తి ఒక్కడే అని తేలిపోయింది. అఫ్‌కోర్స్ తన లాజిక్ కరెక్ట్ అయితే!

కాని ఎవరతడు? హౌ టు ట్రేస్ అవుట్ దట్ 'బ్లడీ బాబూ?' అనుకొన్నాడు రమేష్.

రాజేంద్రను కలిసి వచ్చేశాక ఒక రోజంతా రాంకుమార్ కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళాడో రమేష్‌కు కూడా చెప్పలేదు. 'ఇప్పుడు హంతకుడు మనకు అందుబాటులోనే వున్నాడు' అని అంటున్నాడు. అంటే జయమాల భర్త గాక ఈ హత్యలో యింకో హంతకుడున్నాడా?—రమేష్ మనసునిండా ప్రశ్నలే. జవాబు దొరకని ప్రశ్నలు.

అతని ఆలోచనలను అర్థం చేసుకొన్నట్లు చిన్నగా తల పంకించాడు రాంకుమార్.

"యస్ మిస్టర్ రమేష్! సత్యం తన భార్యను చంపక ముందే బాబు ఆమెను హత్య చేసి వుంటాడు. అదే— రాజేంద్ర వదలి వెళ్ళిపోయిన కత్తితో. హంతకుడు హత్యాయుధాన్ని తనతో కూడా పట్టుకెళ్ళిపోవడం చేత... రాజేంద్ర వదలి వెళ్ళిన కత్తి మీకు కనిపించలేదు."

"ఇక సిల్కు రుమాలును జయమాల నోటిలో కుక్కి హత్య చేసిన తరువాత దానిని తీసేసివుంటాడు బాబు. ఇంతలో, అతడికి జయమాల భర్త సత్యం అడుగుల చప్పుడు వినిపించి వుంటుంది. హత్యాయుధాన్ని తనతో తీసుకువెళ్ళే హడావుడిలో ఆ కర్చీఫ్‌ను మరచిపోయి వుంటాడు బాబు."

"అన్నట్టు ఆ కర్చీఫ్ మీద వేలిముద్రలు ప్రింట్ చేయించారు కదూ....?"—రాంకుమార్ అడిగిన ప్రశ్నకు 'తీయించాను' అన్నట్లు తలూపాడు రమేష్.

"కాని, ఈ బాబు యెవడు సర్ ?" సందేహంగా అడిగాడు రమేష్. రాంకుమార్ తన గ్లాసులోని డ్రింక్‌ను కాస్త సిప్ చేసి చెప్పడం ప్రారంభించాడు.

"రమేష్! నీకు నేను నిన్నంతా కనిపించలేదు కదూ? నిన్న చిట్టివలస వెళ్ళాను. ఆc! జయమాల కన్నవారి ఊరు. విశాఖపట్టణానికి సుమారు ముప్ఫయి కిలోమీటర్ల దూరంలో ఉంది ఆ ఊరు. జయమాల బాబును తనకు చిన్నతనం నుండీ తెలుసునని రాజేంద్రతో చెప్పించింది కదా! బాబు ఆచూకీ బహుశా అక్కడే దొరకవచ్చని వెళ్ళాను.

కాని విచిత్రం యేమిటంటే.... జయమాల నాన్నగారున్న వీధిలో గాని, ఆ పరిసర ప్రాంతాల్లో గాని బాబు పేరు గలవారు మనకు కావాల్సిన వయసులో అంటే యువకుల్లో యెవ్వరూ లేరు.

జయమాల నాన్నగారిని కూడా అడిగిచూశాను. కాని ఫలితం లేకపోయింది. నిరాశతో నేను వెనుతిరిగే ముందు యాదృచ్ఛికంగా జయమాల తమ్ముడు కలిశాడు. నా చివరి ప్రయత్నంగా అతడిని కూడా అడిగాను.

మందు యెవరూ లేరు అన్నాడు. నేను టాక్సీ ఎక్కాను. సరిగ్గా డోర్ క్లోజ్ చేసే ముందు పరుగెత్తుకొంటూ వచ్చాడు. ఏదో గొప్ప విషయం కనుగొన్నట్లు అతని ముఖం సంతోషంతో వెలిగిపోతోంది.

వారి ఎదురింటి పంతులుగారి రబ్బాయిని జయమాల 'బాబు' అని పిలిచేదట. అందరూ అతడి సొంత పేరుతోనో, యింకేదో ముద్దు పేరుతోనో పిలిస్తే ఒక్క జయమాల మాత్రమే అతడిని బాబు అని పిలిచేదట. అందుకే బాబు అంటే ఎవరూ చెప్పలేకపోయారు.

జయమాల పెళ్ళి అయ్యేసరికి బాబు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. నూనూగు మీసాలతో అప్పుడే యవ్వనంలోకి అడుగుపెడుతున్న బాబును జయమాల అందం మైమరిపించేది. ముఖ్యంగా ఆమె విచ్చలవిడితనం తనలో ఏవో కోరికలు రేపుతుంటే జయమాలపై వాంఛను పెంచుకొన్నాడు. కాని ధైర్యం చేయలేకపోయాడు. ధైర్యం చేద్దామనుకొనేసరికి జయమాలకు పెళ్ళి అయిపోయింది. ఇంటర్మీడియట్ పూర్తిచేశాక విశాఖపట్టణం ఎ.వి.ఎన్. కాలేజ్‌లో బి.కాం.లో జాయిన్ అయ్యాడు బాబు. ఫస్టియర్ అంతా హాస్టల్‌లో వుండి చదువుతున్నాడు. కాని చిన్నతనంలోనే అలవాటయిన చెడు అలవాట్లు, కాలేజ్ లైఫ్‌లో మరిన్ని చివుళులు వేశాయి. మితిమీరిన బాబు విశృంఖలత్వానికి ఫలితంగా హాస్టల్ నుండి డిస్మిస్ చేయబడ్డాడు.

ఇప్పుడు పెదవాల్తేరులో చిన్న రూమ్ తీసుకొని ఉంటున్నాడు బాబు. అతని అదృష్టం యేమిటంటే— అతని 'స్వప్నసుందరి' జయమాల కూడా అదే వీధిలో కాపురముంటూంది. జయమాలను ఆ వీధిలో మొదటి

సారి చూసినప్పుడు బాబు గుండె 'లయ' తప్పింది.

ఈ రెండేళ్ళలో జయమాల మరింత సౌందర్యం పుణికి పుచ్చుకున్నట్లనిపించింది బాబుకు. పెళ్ళయ్యాక కాస్త వళ్ళు చేసిందేమో ఫెళ, ఫెళ లాడుతూ మరింత సెక్సీగా వుంది జయమాల.

జయమాల రాజేంద్రతో తిరడగం చూశాడు బాబు. ఆమె పెళ్ళయినా తన ప్రవర్తన మార్చుకోలేదని, పరాయి మగవాళ్ళతో యధేచ్ఛగా తిరుగుతుందని అర్థమయిన మరుక్షణం తన రొట్టె విరిగి నేతిలో పడిందని సంతోషంతో ఉప్పొంగిపోయాడు బాబు.

జయమాల యింటికి రాకపోకలు కొనసాగించాడు. బాబులో తన కన్నవారిని, పుట్టిన ఊరును చూసి మురిసిపోయేది జయమాల. కాని బాబు మనస్సులోని కోరిక తెలిసేసరికి నివ్వెరపోయింది జయమాల.

తనముందు లాగు బొత్తాలు లేకుండా తిరిగిన పిల్లాడు యిప్పుడు అతడు యెంత యెదిగినా తను యెంత శీలం కోల్పోయినా బాబును నగ్నంగా తన ప్రక్కన ఊహించుకోలేకపోయింది జయమాల. అతనిలో తన తమ్ముడిని చూసుకొంటున్నానంటూ అతడి కోరికను మృదువుగా తిరస్కరించింది.

ఎవడో ముక్కూ మొగమూ తెలియని రాజేంద్రతో తిరిగిన ఆడది, పెళ్ళి కాకముందే మోహన్‌తో విచ్చలవిడిగా తిరిగిన ఆడది అవ్‌టాల్ సిగ్గూ యెగ్గూ లేని ఒక బిచ్ తనను కాదనేసరికి కోపంతో పిచ్చెక్కిపోయాడు బాబు.

రాజేంద్రకు ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాశాడు. జయమాలను బెదిరించాడు. కాని తన కోరిక తీర్చడానికి

జయమాల యిష్టపడకపోయేసరికి సహించలేకపోయాడు బాబు. తనకు దక్కని ఆమె అందం ఎవరికీ దక్కకూడ దనుకొన్నాడు. ఫలితమే జయమాల హత్య!"

చెప్పడం ముగించాడు రాంకుమార్. అతడు చెప్పిన దంతా వినేసరికి తల తిరిగిపోయింది రమేష్‌కి.

"అయితే—బాబును వెంటనే అరెస్టు చేద్దామా సర్!" అన్నాడు రమేష్ గ్లాసులో మిగిలిన ద్రవాన్ని గటగటా త్రాగేసి గ్లాసును టీపాయ్‌మీద పెడుతూ.

రమేష్‌వంక నవ్వుతూ చూశాడు రాంకుమార్. "కొంచెం ఓపికపట్టు బ్రదర్! హంతకుడిని, అతడి వాఙ్మూలంతో సహా పట్టుకొందువుగాని."

ఈ మాటలు వినేసరికి త్రాగిన మత్తు కాస్తా దిగి పోయింది రమేష్‌కు.

# 10

సన్నగా ఈల వేసుకొంటూ వచ్చి తన గదిముందు ఆగాడు చాను.

జేబులోంచి తాళంచెవి తీసి తలుపు తెరవబోతున్న వాడల్లా తన రూమ్ ముందే ఒక ఆటో ఆగేసరికి ఆశ్చ ర్యంగా చూశాడు. అందులోనుండి దిగిన వ్యక్తిని చూసే సరికి చాను కనుబొమ్మలు ముడిపడ్డాయి.

అతడు రాజేంద్ర! తను 'గడ్డపు యువకుడు' అని సాక్ష్యం యిచ్చిన యువకుడు. రాజేంద్ర తనకోసం యెందుకు వచ్చినట్లు? చాను కళ్ళల్లో ఆశ్చర్యం.

"మీతో కొంచెం మాట్లాడాలి నరసింహంగారూ" అంటూ రాజేంద్ర తన ప్రక్కకు వచ్చి నిలబడ్డంతో చాను ఒక్కక్షణం తడబడ్డాడు. తాళం తీసి తలుపు తెరుస్తూ "రండి" అంటూ రాజేంద్రను లోపలికి ఆహ్వా

నించాడు చాను.

రెండు గదులున్న చిన్న యిల్లు అది. ముందు గది బెడ్రూమ్ కమ్ డ్రాయింగ్ రూమ్. దానికి ఆనుకొనివున్న చిన్న గది వంటకు, ఏదైనా సామాన్లు పెట్టుకోవడానికి వినియోగిస్తున్నాడు చాను.

ఆ గదిలోని ఒకే ఒక కుర్చీలో రాజేంద్రను కూర్చోమని చెప్పి, తను వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు చాను. 'ఇప్పుడు చెప్పండి....' అన్నట్లు రాజేంద్రను చూశాడు.

రాజేంద్ర సంభాషణను ప్రారంభిస్తున్నట్లు చిన్నగా దగ్గి, గొంతు సవరించుకొన్నాడు. ఒక్కసారి చుట్టూ చూసి, ఆ పరిసరాల్లో ఎవరూ లేరని ధృవపరచుకొన్నాక పెదవి విప్పాడు.

అయితే వారిద్దరకూ తెలియని విషయం మేమిటంటే చాను వంటకు ఉపయోగించే ఆ చిన్న గదిలో యిద్దరు ఆగంతకులు దాక్కొని ఉన్నారు. చాను తన గదికి వచ్చే ముందు సరిగ్గా పది నిముషాల క్రితమే వారిద్దరినీ లోపలికి పంపి పైన తాళం మామూలుగా వేసి, ఆ ఇంటికి ఇరవై గజాల దూరంలో నున్న ఒక చెట్టుకింద పరచుకొన్న చింకి గోనెపట్టాపై పడుకొని తాపీగా బీడీ కాల్చుకొంటు న్నాడు ఒక ముసలి బిచ్చగాడు.

రాజేంద్ర పెదవి విప్పిన మరుక్షణం—తన చేతిలోని మినీ టేప్ రికార్డర్‌ను ఆన్ చేశాడు ఆ ఆగంతకులలో ఒకడు. వంటగదికీ, వారు మాట్లాడుకొంటున్న గదికీ మధ్యనున్న ద్వారంక్రింద నీరు పోయేందుకు ఏర్పరచబడ్డ రంధ్రంలో సన్నని మౌత్ పెట్టబడి వుంది. ఇప్పుడు, ఆ గదిలో చీమ చిటుక్కుమన్నా అది చాలా క్లియర్‌గా

రికార్డ్ అవుతుంది. అంత శక్తివంతమైనది ఆ మినీ టేప్ రికార్డర్.

“మీరు అబద్ధం యెందుకు చెప్పారు నరసింహం గారూ!” చానూ వంకే సూటిగా చూస్తూ అడిగాడు రాజేంద్ర.

“అంటే?” అతడు అడిగేది తనకు అర్థంకాక అసహనంగా చూశాడు చానూ.

“జయమాల హత్య జరిగిన సమయంలో నేను ఆ సందుగుండా రావడం మీరు రూమ్‌లో నుండి చూశారని పోలీసులకు చెప్పారే ఆ విషయం” తాపీగా అన్నాడు రాజేంద్ర.

“ఇందులో అబద్ధమేముంది? మిమ్మల్ని చూశాను గనుకనే నిజాన్ని నిర్భయంగా పోలీసులకు చెప్పాను” చాను ముఖం కందగడ్డలా అయింది.

“మీరు నన్ను చూశారు నరసింహంగారూ. కాని అప్పుడు మీరు మీ రూమ్‌లో లేరు” అంటూ మరింత కూల్‌గా చాను వంక చూశాడు రాజేంద్ర.

“మరి....” చాను ప్రశ్నార్థకంగా చూశాడు.

“అప్పుడు మీరు జయమాల యింటి పెరటిలో దాక్కొని ఉన్నారు నరసింహం.”

రాజేంద్ర మాటలకు ప్రక్కనే బాంబు పడినట్లు త్రుళ్ళిపడ్డాడు. అతని ముఖం మ్లానమయింది. “నో!” అంటూ సన్నగా గొణిగాడు చాను.

“అవును నరసింహంగారూ! నేను అంతా చూశాను. నా చిన్ని కెమేరా ఆ సన్నివేశాన్ని ఎంచక్కా తనలో యిముడ్చుకొంది కూడాను”—సాడిస్టిక్‌గా నవ్వుతూ అన్నాడు రాజేంద్ర.

"ఏమిటి....ఏ....మి....టి....మీరు చూ...సి...ంది?" గొంతులోని వణుకును కప్పిపుచ్చుకోడానికి విఫల ప్రయత్నం చేస్తూ అడిగాడు చాను.

"నేను బయటకు వెళ్ళాక మీరు పిల్లిలా ఆ గదిలోకి ప్రవేశించారు. మంచంమీది నుండి లేచి బట్టలు అందుకోవడానికి ప్రయత్నిస్తున్న జయమాల మిమ్మల్ని చూసి నిర్ఘాంతపోయింది.

ఇప్పటికయినా మీ కోరిక తీర్చమని ...ఇదే ఆమెకు ఆఖరి అవకాశమని అంటూ ఆమెను సమీపించారు. ఆమె నగ్న దేహం మీలో కోరికలను రగిలించసాగింది. ఆమెను మంచంమీదకు త్రోసి ఆమెమీదకు వంగారు...."

రాజేంద్ర చెబుతున్నది వింటున్న కొద్దీ చాను ముఖం పాలిపోసాగింది. ఒక్కసారిగా పది లంఖణాలు చేసినట్లు అతని కళ్ళు పీక్కుపోయాయి.

"జయమాల మిమ్మల్ని ప్రతిఘటించేసరికి మీరు ఓర్చుకోలేకపోయారు. తనమీద మీరు అత్యాచారం చేయటానికి ప్రయత్నిస్తే గోల చేస్తానంది ఆమె. ఆమె నోటిలో మీ జేబురుమాలు కుక్కారు."

చెమటలు పడుతున్న చాను ముఖం వంకే చిలిపిగా చూస్తూ చెప్పడం ఆపాడు రాజేంద్ర. ఏదో తెలియని ఉక్రోషంతో చాను పెదవులు అదురుతున్నాయి.

"అది....అది....దట్ బ్లడీ బిచ్ నన్ను కొడుతుందా? అందుకే....అందుకే...." ఏడుపు, ఆవేశం కలిసిన ఒక రకమయిన గొంతుతో వగరుస్తూ కీచుగా అరిచాడు చాను.

"అందుకే....ఆపుకోలేని ఆవేశంతో నేను మంచంమీదే వదిలేసిన కత్తితో జయమాలను పొడిచి

చంపారు" చాను కళ్ళలోకే సూటిగా చూస్తూ అన్నాడు రాజేంద్ర.

"కాని....కాని అందుకు సాక్ష్యం లేదు" తడారి పోతున్న గొంతుతో అన్నాడు చాను.

"సాక్ష్యం వుంది నరసింహాం! నీవు జయమాలను హత్య చేస్తుండగా నేను తీసిన ఫోటో వుంది" నిర్వికారంగా చానును చూస్తూ అన్నాడు రాజేంద్ర.

"లేదు. నేను జయమాలను హత్య చేస్తుండగా యే ఫ్లాష్ కూడా వెలగలేదు. ఇది నీవు నన్ను బ్లాక్ మెయిల్ చేయడానికి ఆడుతున్న నాటకం"—పిచ్చిగా అరిచాడు చాను.

రాజేంద్ర నవ్వుతూ చూస్తూన్నాడు. చానును యీ క్షణం ఫోటో తీసే ఎలా వుంటుంది అన్న చిలిపికోరిక జనించింది రాజేంద్ర మనసులో.

అదే సమయంలో వంటగది తలుపులు భళ్ళున తెరుచుకొన్నాయి. అందులో నుండి బయటకు వచ్చిన ఆగంతకుల వంక వెర్రిగా చూశాడు చాను.

వారు సి.బి.ఐ. ఆఫీసర్ రాంకుమార్, సబ్ యిన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రమేష్. రమేష్ చేతిలోని మినీ టేప్ రికార్డర్ను చూసేసరికి యేదో భయంతో వణికి పోయాడు చాను.

"థాంక్యూ బాబూ! థాంక్స్ ఫర్ యువర్ స్టేట్మెంట్" అన్నాడు రాంకుమార్.

'బాబు' అన్న పేరు వినినవెంటనే ఛర్నాకోలతో వెన్నుమీద కొట్టినట్లు ఉలిక్కిపడ్డాడు చాను. 'నిజమా?' అన్నట్లు తనవంక ప్రశ్నార్థకంగా చూస్తున్న రమేష్ భుజం తట్టాడు రాంకుమార్.

"ఇక నీవు తప్పించుకోలేవు బాబూ! కర్చీఫ్ పై నీ వేలిముద్రలు, ఆకాశరామన్నగా నీవు వ్రాసిన ఉత్తరాలు, ముఖ్యంగా యిప్పుడు నీకూ, రాజేంద్రకూ జరిగిన సంభాషణంతా రికార్డు చేయబడింది.

నిన్ను హంతకుడిగా నిరూపించడానికి ఈ ఆధారాలు చాలవంటావా?" చాను వంకే సూటిగా చూస్తూ అన్నాడు రాంకుమార్.

ఒక్కసారి ఆ ముగ్గురివంకా చూశాడు చాను. మరుక్షణం మెరుపులా తలుపువంక పరుగెత్తాడు. రాంకుమార్, రమేష్ యేమాత్రం కూడా కదలకుండా అలానే చూస్తూ నిలుచున్నారు. రాజేంద్ర రియాక్టయి చానును ఆపడానికి ప్రయత్నించాడు. కాని అప్పటికే చాను తలుపు తెరచి బయటకు అడుగువేశాడు.

బయటకు అడుగు వేసిన చాను కరెంట్ షాక్ కొట్టినట్లు వెనక్కు త్రుళ్ళిపడ్డాడు. ఆ గది బయట నిలుచుని ఉన్నాడు, అంతవరకూ ఆ చెట్టుక్రింద పడుకొని వున్న ముసలి బిచ్చగాడు. అతడి చేతిలో నల్లగా నిగ, నిగలాడుతూ మెరుస్తూంది ఒక రివాల్వర్.

'గుడ్ వర్క్' అన్నట్లు ఆ క్రయింబ్రాంచ్ ఇన్స్పెక్టర్ వంక ప్రశంసాపూర్వకంగా చూశాడు రాంకుమార్. చిరునవ్వు నవ్వుతూ తన చింకి జోలెలో నుండి సంకెళ్ళు తీసి ముందుకు అడుగువేశాడు బిచ్చగాడి వేషంలో వున్న ఆ ఇన్స్పెక్టర్.

సిగ్గుతో తల దించుకొని మౌనంగా చేతులను పైకి ఎత్తాడు చాను ఉరఫ్ బాబు.

ఆ గది బయటకు నడుస్తున్న రాంకుమార్ను అడిగాడు రమేష్, ఎంతో సేపటి నుండి ఉత్కంఠతో దాచు

కొన్న సందేహాన్ని.

"చానుయే బాబని మీరు యెలా అనుమానించారు సర్!?"

చేతికి వేయబడ్డ సంకెళ్ళతో ముందు నడుస్తున్న చాను ఆగి వెనుతిరిగి చూశాడు.

'అవును.... నా మీద యెందుకు వచ్చింది మీకు సందేహం?' అన్నట్లు వుంది అతని చూపు.

వారిద్దరి వంక సాభిప్రాయంగా చూశాడు రాంకుమార్.

"ఆ పువ్వులచొక్కా యువకుని గురించి చెబుతూ.... అతడు వస్తూ, వస్తూ జేబులు తడుముకొన్నాడు. బహుశా, కర్చీఫ్ మరచిపోయాడేమో" అన్నాడు చాను.

"ఆ కర్చీఫ్ మరచిపోయాడేమో" అన్న మాట ఎందుకో నాకు అసహజంగా అనిపించింది. చాను ప్రత్యేకంగా తన అభిప్రాయం యెందుకు చెప్పాడు? ఒక వేళ.... ఆ కర్చీఫ్‌ను యెవరో మరచిపోయారన్న అభిప్రాయాన్ని నాకు కల్గించడానికా? ఎందుకు? అతనికేమిటి ఆ అవసరం? అనుకున్నాను.

రాజేంద్ర చెప్పిన బాబు, చాను చెప్పిన పువ్వుల చొక్కా ఒక్కడే అయితే ...'హాండ్ కర్చీఫ్' మరచిపోయాడని పువ్వుల చొక్కామీద నెట్టాల్సిన అవసరం చానుకేమిటి?

తను చేసిన నేరాన్ని యితరులమీదకు గుద్దడానికి ప్రయత్నిస్తాడు నేరస్థుడు .... అయితే చాను నేరస్థుడా ....?

ఈ కేసులో బాబు నేరస్థుడు, బాబు, చాను

ఒక్కరే అయితే మరి పువ్వుల చొక్కా....? బహుశా చాను తనను తాను రక్షించుకోవడానికి సృష్టించిన కొత్త పాత్ర అయివుంటుంది. అది నిరూపించుకోవడానికి రాజేంద్ర చేత ఈ నాటకం ఆడించాల్సి వచ్చింది" అంటూ చెప్పడం ముగించాడు రాంకుమార్.

'ఈ మట్టిబుర్రకు యివన్నీ యెందుకు తట్టిచావవు?' అని తనను తాను మొదటిసారి నిందించుకొన్నాడు రమేష్.

—: అయిపోయింది :—